ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
సోమవారం 17 నవంబరు 2025 | 5





నేడు కలెక్టరేట్‌లో యథావిధిగా పీజీఆర్ఎస్

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ కలెక్టరేట్‌లో ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదికను సోమవారం యథావిధిగా నిర్వహిస్తామని కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఆదివారం ఆయన ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సోమవారం ఉదయం పది నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అర్జీలను స్వీకరిస్తామన్నారు. పీజీఆర్ఎస్‌కు హాజరు కాలేని వారు మీకోసం వెబ్‌సైట్‌లో అర్జీలు నమోదు చేసుకోవాలన్నారు.

నేడు ఐదు కిలోమీటర్ల పాదయాత్ర

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సర్దార్ వల్లభాయ్ పటేల్ 150వ జయంతి, రాష్ట్రీయ ఏక్తాదివస్ వేడుకలను పురస్కరించుకుని సోమవారం ఉదయం పది గంటలకు యువతతో ఐదు కిలోమీటర్ల పాదయాత్ర నిర్వహిస్తున్నట్టు కలెక్టర్ షాన్‌మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. కాకినాడ భానుగుడి సెంటరు నుంచి సాంబమూర్తినగర్‌లోని ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల వరకు పాదయాత్ర నిర్వహిస్తామని, దీన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఎనీవేర్.. అవినీతి!



కరప్షన్‌కింగ్‌లు..రిజిస్ట్రార్లు

కొందరు మారరంతే.. మామూళ్ల మత్తులో జోగుతారు.. తప్పయినా ధైర్యంగా చేసేస్తారు. ఏదైనా సరే వీళ్ల నోటి నుంచి వచ్చే మాట.. నాకేంటి..!? ఎందుకంటే చేయి తడిపితేనే కానీ పెన్ను కదపరు.. చేయి తడపలేదంటే ఏదో వంక పెడతారు.. చేయాల్సిన పని ఆపేస్తారు.. నెలల తరబడి తిప్పుకుంటారు.. రోజుకు తక్కువంటే రూ.50 వేలపైనే వెనకేస్తారు.. ఇంతకీ మారనిది ఎవరంటారా.. సబ్‌రిజిస్ట్రార్లు.. నిత్యం మామూళ్ల మత్తులో జోగేది వీళ్లే మరి..

- సబ్ రిజిస్ట్రార్‌కు మామూళ్లు చెల్లించాల్సిందే
- ఒక్కో రిజిస్ట్రేషన్‌కు 2 శాతం లేదా 3 శాతం
- ఏదైనా తప్పు దొర్లితే మామూళ్లు అధనమే
- ఉమ్మడి జిల్లావ్యాప్తంగా పెరిగిన దోపిడీ
- రోజూ అధనంగా లక్షలు.. వేలు
- అయినా కన్నెత్తి చూడని ఏసీబీ

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతికి కేరాఫ్ అడ్రస్‌లుగా మారిపోయాయి. మామూళ్లు లేనిదే పనిజరగని ప్రభుత్వ కార్యాలయం ఏదైనా ఉందంటే అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయమే. అయినా మన ఏసీబీ అధికారులకు ఎందుకో కనబడదు. ఎందుకంటే అక్కడ అవినీతి ఉండడంతో కళ్లెదుటే అవినీతి జరుగుతున్నా పట్టించుకోరు. కనీసం కన్నెత్తి చూసే ధైర్యమూ చేయరు. జిల్లా కేంద్రాల్లో సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం నుంచి ప్రతిరోజూ సబ్ రిజిస్ట్రార్ రూ.లక్షపైనే అద నంగా ఇంటికి తీసుకెళతాడనేది ఒక ఉద్యోగి చెప్పిన మాట. అయినా ఏసీబీ అధికారులకు పట్టదు. జిల్లా కేంద్రంలో సబ్ రిజిస్ట్రార్లు చాలా తెలివిగా ఉంటారు. ఏ రూపాయి వారి వద్ద పెట్టుకోరు. వారికి బ్రోకర్లు ఉంటారు. ఎక్కువ రిజిస్ట్రేషన్లు తెచ్చే లేఖరితో ఎక్కువ మంతనాలు సాగిస్తారు. వారు ఏం చెబితే అది సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో జరిగి తీరుతుందంతే.

మామూళ్లు.. మామూలే..

రిజిస్ట్రేషన్ ఏదైనా సరే మామూళ్లు ఇవ్వాల్సిందే. కేవలం భూములు కొనుగోలు, అమ్మకాల రిజిస్ట్రేషన్లే కాదు. గిఫ్ట్, తనఖా, పూర్వపు ఆస్తి పంపకాలు, మ్యారేజి రిజిస్ట్రేషన్లు, జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ, సేల్ అగ్రిమెంట్ కమ్ జీపీ, లీజ్ డీడ్, వీలునామా, చెల్లు రశీదులు ఇలా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అనేక లావాదేవీలు జరుగుతుంటాయి. ఏ రిజిస్ట్రేషన్ అయినా చేయి తడపాల్సిందే. రిజిస్ట్రేషన్లు ఆన్‌లైన్ అయిన తర్వాత అవినీతి తగ్గిపోతుందని అందరూ అనుకున్నారు. ప్రభుత్వాలు విస్తృత ప్రచారం చేశాయి. కానీ ఎక్కడా తగ్గలేదు. సబ్‌రిజిస్ట్రార్‌తోపాటు, ఆఫీసులో పని చేసేవారందరికీ మామూళ్లు ఇవ్వవలసిందే. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లావ్యాప్తంగా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు అవినీతిలో మునిగితేలుతున్నాయి.

36 ఆఫీస్‌లు..

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో 36 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఉన్నాయి. తూర్పుగోదావరి జిల్లాలో 12, కోనసీమ జిల్లాలో 15, కాకినాడ జిల్లాలో 9 ఉన్నాయి. ప్రతి జిల్లాకు జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం (డీఆర్) ఉంది. ఒక్కో జిల్లాలో నెలకు 6 వేల నుంచి 7వేల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతుంటాయి. మొత్తం ఉమ్మడి జిల్లాలో నెలకు సుమారు 20వేల వరకూ రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ప్రతీ దానికీ మామూళ్లే. కాకినాడలో ఈ ఏడాది మార్చిలో జిల్లా రిజిస్ట్రార్ తన అసిస్టెంట్ సహా లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడంటే లంచాలు ఏ స్థాయిలో ఉన్నాయో అర్థమవుతుంది.

తూర్పుగోదావరి జిల్లాలోని ఒక గ్రామానికి చెందిన ఒక వ్యక్తికి అమ్మాయిలు మాత్రమే ఉండడంతో ఒక అబ్బాయిని దత్తత తీసుకున్నాడు. కుమార్తెలకు పెళ్లిళ్లు చేసి.. ఆస్తి మొత్తం దత్తపుత్రుడికి రాసిచ్చేశాడు. ఆ తర్వాత అతను చనిపోయాడు. తండ్రి గిఫ్ట్‌గా ఏదైనా ఆస్తి రిజిస్ట్రేషన్ చేసి చనిపోతే అది రద్దు చేసే అధికారం ఉండదు. కానీ ఆ రిజిస్ట్రేషన్ రద్దు చేసేశారు. ఇది ఎలా జరిగిందనేది అందరికీ ఆశ్చర్యమే. ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌లో లొసుగుల వల్ల ఇటువంటి తప్పులు జరుగుతున్నాయి.

గత వైసీపీ హయాంలో గోపాలపురంలో ప్రభుత్వానికి, ప్రైవేట్ వ్యక్తుల మధ్య వివాదాస్పదంగా ఉన్న భూమిని వైసీపీ నేతలు తక్కువ ధరకు కొనుగోలు చేసి కొవ్వూరు, కోరుకొండ తదితర ప్రాంతాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవడమేగాకుండా డబుల్ రిజిస్ట్రేషన్లు చేసేశారు. సర్వే నెంబర్ ముందు ఏదో ఒక అక్షరం పెట్టి కానిచ్చేశారు. ఉదాహరణకు సర్వే నెంబర్ 11/1 ఉంటే ఆ పేరుతో అప్పటికే రిజిస్ట్రేషన్ అయితే సర్వే నెంబర్ 11/1ఎ అని మార్చి డబుల్ రిజిస్ట్రేషన్లు చేసేశారు. డాక్యుమెంట్ రైటర్ నుంచి మొదలుపెట్టి సబ్‌రిజిస్ట్రార్ వరకూ మామూళ్లు ఇచ్చుకుంటూ మనది కాని ఆస్తి కూడా ఇవాళ మనదైపోతోంది. రాజమహేంద్రవరం భాస్కర్‌నగర్‌లో ఇటువంటి రిజిస్ట్రేషన్లు కోకొల్లలు..

అవినీతి జరిగేదిలా..

సాధారణంగా రూ.10 లక్షల విలువ ఉన్న ఆస్తికి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలంటే ప్రస్తుత విలువ ప్రకారం రూ.75,500 చలానా కట్టాలి.. డాక్యుమెంట్ రైటర్‌కి రూ.2 వేలు ఇవ్వాలి.. ఇదీ రివాజు. అంటే మొత్తం అంతా కలిపి రూ.77,500 అవుతుంది.. అయితే రూ.10 లక్షల ఆస్తి రిజిస్ట్రేషన్ చేయించుకుంటే అన్ని ఖర్చులు కలిపి సుమారు రూ.90 వేలు పైనే అవుతుంది. ఎందుకంటే సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో ఆమ్యామ్యా ఎంతో తెలుసా రూ.12,500. ఈ రేటు ఏం తేడాలేకపోతేనే.. కాగితాల్లో ఏదైనా తేడా ఉందో.. తేడాను బట్టి రేటు ఉంటుంది. అది ఎంతనేది చెప్పడం కష్టమే. అది సబ్ రిజిస్ట్రార్ దయపై ఆధారపడి ఉంటుంది మరి.. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా ప్రతి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలోనూ సబ్ రిజిస్ట్రార్ ఒక రేటు ఉంటుంది.. అదే 2 శాతం లేదంటే 3 శాతం.. ఏం తేడా లేకపోతే ప్రతి రిజిస్ట్రేషన్‌కి ఈ మొత్తం చెల్లించాల్సిందే. ఇది లేఖరి దగ్గరే మొదలైపోతోంది. మన తీసుకెళ్లిన ఆస్తిని బట్టి ఎంత ఖర్చవుతుందనేది లేఖరు చెప్పేస్తాడు. రూ.10 లక్షల విలువ కలిగిన ఆస్తి అయితే అన్ని ఖర్చులు కలుపుకుని రూ.లక్ష వరకూ ఖర్చవుతుందని చెబుతాడు. దీనిలో సబ్ రిజిస్ట్రార్ 2 శాతం అంటే రూ.2 వేలు.. లేదంటే 3 శాతం రూ.3 వేలు ఉంటుందన్నమాట. ఇదికాక ఆ ఆఫీస్‌లో పనిచేస్తున్న వారికి రూ.2 వేల వరకూ ఉంటుంది. ఇందులోనూ సబ్‌రిజిస్ట్రార్‌కు వాటా మామూలే. అదికాక లేఖరి ఖర్చులు.. ఇలా అన్నీ కలుపుకుంటే రూ.77,500 అయ్యే ఖర్చును మామూళ్లతో కలిసి రూ.లక్ష చేస్తారు.

నిద్దరోతున్న ఏసీబీ..

ఆయా రిజిస్ట్రేషన్ కార్యాలయం నుంచి ఉన్నతాధికారులకు కొంత వాటా ఇవ్వాలనే వాదన ఉంది. ఇటీవల రాష్ట్రవ్యాప్తంగా అనేక జిల్లాల్లో ఏసీబీ ఆకస్మిక దాడులు చేసిన సంగతి తెలిసిందే. చాలామంది వద్ద భారీగా అవినీతి సొమ్ము లభ్యమైంది.కానీ ఉమ్మడి గోదావరి జిల్లాలో భయం లేకుండా పోయింది. పలు జిల్లాల్లో దాడులు జరిగిన మర్నాడు ఓ సబ్‌రిజిస్ట్రార్ ఒక రిజి స్ట్రేషన్‌లో తనకు ఎంతిస్తారని నేరుగా అడగడంతో అక్కడున్న వారంతా అవాక్కవడం గమనార్హం. మొత్తం మూడు జిల్లాల్లో రోజూ రూ.లక్షల్లోనే అవినీతి జరుగుతోంది.ఇకనైనా ఏసీబీ అధికారులు ఫోన్ చేయండి పట్టుకుంటాం అన్నట్టు కాకుండా ఆకస్మిక తనిఖీలు చేసినా పట్టుబడతారు.

రైట్.. రైట్..

- డ్రైవింగ్‌పై ఆసక్తి ఉన్న వారికి శుభవార్త
- ప్రభుత్వ గుర్తింపు డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటుకు సన్నాహాలు
- కాకినాడలో డీటీసీ, ఆర్‌డీటీసీ నెలకొల్పేలా ఆలోచనలు

(కాకినాడ - ఆంధ్రజ్యోతి)

డ్రైవింగ్ నేర్చుకోవాలనుకునే వారికి నిబంధనల ప్రకారం శిక్షణ అందించేలా ప్రభుత్వం కేంద్రాలు ఏర్పాటుచేయనుంది. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ గుర్తింపుతో ఈ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు రానున్నాయి. ఇప్పటివరకు కొత్తగా డ్రైవింగ్ లైసెన్స్ కావాల్సిన వారికి సరైన శిక్షణ, అవగాహన లేకుండానే లైసెన్సులు పొందుతున్నారు. మరోవైపు పట్టణాలు, నగరాల్లో డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు ఉన్నా.. వాటికి డ్రైవింగ్ ట్రాక్‌లు, ఇతర వసతులు లేకుండా మొక్కుబడి శిక్షణ ఇస్తున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్ర రవాణా, జాతీయ రహదారులశాఖ (మోర్త్) రాష్ట్రవ్యాప్తంగా 53 డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల(డీటీసీ)తోపాటు ఐదు ప్రాంతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు (ఆర్‌డీటీసీలు) కూడా మంజూరు చేసింది. దీనిలో భాగంగా కాకినాడ జిల్లాలోనూ ఈ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయనున్నారు. జిల్లాలో వాహనచోదకుల సంఖ్య పెరిగింది. అలాగే వాహనాలను నడపాలని ఆసక్తి ఉన్న వారు కూడా పెరిగారు. మహిళలు ద్విచక్రవాహనాలు, కార్లు సైతం నడిపేస్తున్నారు. అలాగే ఇటీవల కాలంలో యువత కూడా లారీలు, బస్సులు వంటి భారీ వాహనాలను నడిపేందుకు సిద్ధమవుతున్నారు. అయితే కొంత మంది ప్రైవేటు శిక్షణ కేంద్రాల వద్ద నేర్చుకుంటే.. మరికొంతమంది మాత్రం స్నేహితులు, బంధువుల వాహనాలపై క్లీనర్లుగా చేరి డ్రైవర్లుగా మారుతున్నారు. ఇలాంటి వారికి రవాణాశాఖ నిబంధనలు తెలియడం లేదు. దీంతో ఇష్టానుసారం డ్రైవింగ్ చేస్తూ ప్రమాదాలకు కారణమవుతున్నారు. అదే ప్రభుత్వం నిర్వహించే శిక్షణ కేంద్రాల్లో డ్రైవింగ్‌లో అనుభవజ్ఞులైన డ్రైవర్ల వద్ద మెలకువలు నేర్చుకోవడం ద్వారా నిష్ణాతులుగా మారే అవకాశం ఉంది. ఇప్పటివరకు కాకినాడ జిల్లాలో డ్రైవింగ్ నేర్చుకోవాలనుకునే వారు చాలామంది ప్రైవేటు డ్రైవింగ్ స్కూళ్లను ఆశ్రయిస్తున్నారు. రోజుల వ్యవధిలో ఉండే శిక్షణకు వేలా రూపాయలు ఖర్చు చేస్తున్నారు. జిల్లాలో హెవీ, లైట్ మోటార్ వెహికల్ డ్రైవింగ్ నేర్పే శిక్షణ సంస్థలు సుమారు 20 వరకు ఉన్నాయి.

ఆర్‌డీటీసీకి మూడెకరాలు.. డీటీసీకి రెండెకరాలు

ఒక ఆర్‌డీటీసీ(ప్రాంతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రం) ఏర్పాటుకు కనీసం మూడెకరాల స్థలం ఉండాలి. వీటిలో పెద్ద ట్రాక్‌లు ఏర్పాటుచేస్తారు. ఒక్కో సెంటర్‌కు కేంద్రం రూ.ఐదు కోట్ల వరకు ఆర్థిక సాయం అందించనుంది. అందులో శిక్షణ పూర్తి చేసుకుంటే ఆ సెంటర్ నుంచే డ్రైవింగ్ లైసెన్స్‌కు దరఖాస్తు చేసి మంజూరయ్యేలా చేస్తారు. డ్రైవింగ్ శిక్షణ కేంద్రాల ఏర్పాటుకు కనీసం రెండెకరాల స్థలం ఉండాలి. ఒక్కో ప్రాజెక్టు ఏర్పాటుకు అయ్యే వ్యయంలో 85శాతంగాని, గరిష్ఠంగా రూ.2.5 కోట్ల వరకు మోర్త్ అందిస్తుంది.

ఏర్పాటు ఎలా అంటే..

డీటీసీలు, ఆర్‌డీటీసీల ఏర్పాటుకు ఆసక్తి ఉన్న వ్యక్తులు, సంస్థల నుంచి రవాణాశాఖ దరఖాస్తులు స్వీకరిస్తోంది. వీటిని ఏర్పాటు చేయాలనుకునే వాళ్లు కలెక్టర్లకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. అక్కడ వాటిని పరిశీలించి రవాణా శాఖ కమిషనర్‌కు సిఫారసు చేస్తారు. అవసరమైన భూమి, ఇతర అర్హతలు ఉంటే వాటిని పరిశీలించి సగటున జిల్లాకు రెండు చొప్పున డీటీసీలు మంజూరు చేస్తారు. ఇప్పటికే కాకినాడ నుంచి ఒక దరఖాస్తు వచ్చింది. డీటీసీలు, ఆర్‌డీటీసీలకు జనవరి ఆఖరు వరకు దరఖాస్తులకు అవకాశం కల్పిస్తున్నారు. ఫిబ్రవరి ఆఖరుకు వాటిని మోర్త్‌కు పంపాల్సి ఉంటుందని రవాణాశాఖ అధికారులు తెలిపారు. వచ్చే ఏడాదికి అందుబాటులోకి తీసుకొచ్చేలా కసరత్తు చేస్తున్నారు.

నేరుగా లైసెన్స్ జారీ..

డ్రైవింగ్ శిక్షణ సంస్థలో ద్విచక్ర వాహనం, లైట్ మోటారు వాహనం(కార్లు), భారీ వాహనాలు(లారీలు, బస్‌లు) నడిపేందుకు శిక్షణ ఇస్తారు. మెలకువలు నేర్పే తరగతులతోపాటు, సిమ్యులైటర్స్‌పైన, తర్వాత ట్రాక్స్‌పై శిక్షణ ఇస్తారు. ఏయే లైసెన్సులకు ఎన్ని రోజుల శిక్షణ, ఎంత ఫీజులు వంటివి మోర్త్ ఖరారు చేస్తుంది. డీటీసీలో శిక్షణ పూర్తి చేసుకుంటే రవాణాశాఖ వద్ద లైసెన్స్ పొందే సమయంలో డ్రైవింగ్ పరీక్షకు హాజరుకావాల్సిన అవసరం లేదు. నేరుగా లైసెన్స్ జారీ చేస్తారు.

దరఖాస్తు చేయొచ్చు



కాకినాడలో డ్రైవింగ్ ట్రైనింగ్ సెంటర్ల ఏర్పాటుకు చర్యలు చేపడుతున్నాం. వీటిని ఏర్పాటు చేయాలనుకునేవారు కలెక్టర్లకు దరఖాస్తు చేయాలి. వచ్చే ఏడాదిలో ఈ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది - **శ్రీధర్, ఉపకమిషనర్, రవాణాశాఖ కాకినాడ**





విలేకరులతో మాట్లాడుతున్న జనసేన జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి.. ఫైవ్‌మెన్ కమిటీలో నియమితుడైన ఓదూరి కిషోర్

జనసేన బలోపేతమే లక్ష్యంగా

కార్యాచరణ

జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి.. ఫైవ్‌మెన్ కమిటీలో ఓదూరి కిషోర్‌కి చోటు

గొల్లప్రోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జనసేనను బలోపేతం చేసేందుకు ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నారని, అందులోభాగంగానే పిఠాపురం నియోజకవర్గ ఫైవ్‌మెన్ కమిటీలో మార్పులు జరుగుతున్నాయని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు తుమ్మల రామస్వామి (బాబు) పేర్కొన్నారు. ఆదివారం ఆయన గొల్లప్రోలులో విలేకరులతో మాట్లాడారు. ఫైవ్‌మెన్ కమిటీలో ఇప్పటివరకు ఉన్న పిఠాపురం నియోజకవర్గ జనసేన ఇన్‌చార్జి మర్రెడ్డి శ్రీనివాసరావుకు బదులు ఓదూరి కిషోర్‌కి అవకాశం కల్పించినట్టు చెప్పారు. యువతకు రాజకీయాల్లో పెద్దపీట వేయాలనే ఆలోచన భాగంగానే ఈ మార్పు చేశారన్నారు. కమిటీలో ఎంపీ తంగెళ్ల ఉదయ్‌శ్రీనివాస్, ఎమ్మెల్సీ హరిప్రసాద్, తుమ్మల రామస్వామి, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, ఓదూరి కిషోర్ ఉన్నారని చెప్పారు. పార్టీ అభివృద్ధిలో భాగంగా మర్రెడ్డిని పిఠాపురం నుంచి అనపర్తికి పంపించారని తెలిపారు.

కార్తీకం.. రూ.కోటి ఆదాయం!

- సత్యదేవుడి సన్నిధికి ఆదివారం లక్ష మంది భక్తులు రాక
- 10,523 వ్రతాలు
- గంటల తరబడి క్యూలైన్లలో ఉండిపోయిన జనం

7

ప్లాస్టిక్ వాడకానికి చెక్



కాకినాడ నగరంలోని ఓ దుకాణంలో తనిఖీ నిర్వహిస్తున్న అధికారులు (ఫైల్‌ఫొటో)

- దుకాణాల్లో అధికారుల తనిఖీలు
- వినియోగించిన వ్యాపారులకు జరిమానాలు
- ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లను సిద్ధంచేస్తున్న అధికారులు

కార్పొరేషన్(కాకినాడ), నవంబరు 16(ఆంధ్రజ్యోతి): పరిసరాల పరిశుభ్రత, పర్యావరణ పరిరక్షణకు ప్రభుత్వం తీసుకున్న కఠిన నిర్ణయాలు ఇప్పుడు కార్యరూపం దాల్చుతున్నాయి. ప్లాస్టిక్ నిషేధంపై పటిష్ఠ చర్యల్లో భాగంగా పట్టణంలోని పలు ప్రాంతాల్లో దుకాణాలు, హోటళ్లపై అధికారులు గత నాలుగు రోజులుగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. నిబంధనలు ఉల్లంఘించిన పలువురు వ్యాపారులకు జరిమానాలు విధించారు. మున్సిపల్ కార్పొరేషన్ హెల్త్ సెక్షన్ అధికారులు, సచివాలయం ఉద్యోగులు సంయుక్త బృందాలు ఈ తనిఖీలు నిర్వహించాయి. ప్రత్యేకంగా 75మైక్రాన్లకన్నా తక్కువ మందంతో ఉన్న ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, స్ట్రాల వాడకాన్ని టార్గెట్ చేశారు. తనిఖీల్లో భాగంగా పలు చిన్నా పెద్ద వ్యాపార స్థలాల్లో ఈ తనిఖీలు నిర్వహించారు. కొన్నిచోట్ల నిషేధిత ప్లాస్టిక్ వస్తువులు పట్టుబడడంతో అక్కడి వ్యాపారులకు జరిమానా విధించారు. అధికారులు వ్యాపారులతోపాటు, స్థానికులతో కూడా మాట్లాడి ప్లాస్టిక్ వాడకానికి తాము ఎందుకు చెక్ పెడుతున్నామో వివరించారు. పర్యావరణానికి ప్లాస్టిక్ కలిగించే హానిని గురించి అవగాహన కల్పించారు.

ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు సన్నద్ధం

ప్లాస్టిక్ నిషేధంపై పూర్తిస్థాయిలో చర్యలు చేపట్టే దిశగా మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఇందుకుగాను నగరంలో రెండు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లను సిద్ధం చేస్తున్నారు. ఒక్కొక్క టీంలో ఒక శానిటరీ సూపర్‌వైజర్, ఒక శానిటరీ ఇన్‌స్పెక్టర్, నలుగురు శానిటేషన్ సెక్రటరీలు ఉంటారు. ఈ రెండు టీంలు ప్రతీరోజు నగరంలో దుకాణాలు, హోటల్స్, చిన్నచిన్న వ్యాపారులు వద్ద వినియోగిస్తున్న ప్లాస్టిక్‌పై దాడులు నిర్వహించి ప్లాస్టిక్ నిషేధానికి పూర్తిస్థాయిలో సన్నద్ధమవుతున్నారు. అదేవిధంగా ప్రైవేట్ కంపెనీల నుంచి సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా సీజ్ చేసిన ప్లాస్టిక్‌ను తరలించేందుకు రెండు వాహనాలు ఏర్పాటు చేసుకోవడానికి అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. తద్వారా ప్లాస్టిక్ నిషేధానికి కొరడా ఝుళిపించనున్నారని తెలుస్తోంది.

పర్యావరణ పరిరక్షణే లక్ష్యం




ప్లాస్టిక్ నిషేధంపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. ఇది పర్యావరణానికి తీవ్ర ముప్పుగా మారుతుంది. అందుకే కఠిన చర్యలు తీసుకుంటున్నాం. ప్లాస్టిక్‌కి బదులు ప్రత్యామ్నాయాలను అందించాలన్న దిశగా చర్యలు తీసుకుంటాం. **- కేటీ సుధాకర్, కాకినాడ కమిషనర్**

తనిఖీలకు టాస్క్‌ఫోర్స్



ప్లాస్టిక్ నిషేధంపై పూర్తిస్థాయి తనిఖీలు నిర్వహించేందుకు ఎన్‌ఫోర్స్‌మెంట్ టీమ్‌లు సిద్ధం చేస్తున్నాం. ఇకపై ప్రతీరోజూ ఈటీంలు దాడులు నిర్వహిస్తూ ప్లాస్టిక్ అమ్మకాలు కొనసాగించిన వారిపై ఫైన్‌లు విధిస్తూ ఉంటాయి. **- డాక్టర్ డి.పృథ్వీచరణ్, హెల్త్ ఆఫీసర్, కాకినాడ కార్పొరేషన్**

పంట నష్ట పరిహారం పెంపుదల




సామర్లకోట, నవంబరు16 (ఆంధ్రజ్యోతి): ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకునేందుకు పంట నష్టపరిహారం పెంచుతూ ప్రభుత్వం నుంచి జీవో ఎంఎస్ నంబరు1 పేరిట ఉత్తర్వులు ప్రభుత్వ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి ఆర్‌పీ సిసోడియా జారీ చేసినట్టు జిల్లా వ్యవసాయాధికారులు తెలిపారు. గతంతో పోలిస్తే ఆయా పంటలకు రూ.8 వేల నుంచి రూ.15 వేల వరకూ అదనపు పరిహారం అందనుందని తెలిపారు. ఉత్తర్వులు అన్ని మండల వ్యవసాయాధికారుల కార్యాలయాలకు అందాయి.

పంట (హెక్టార్లలో)	పరిహారం (రూపాయల్లో) గతం	ప్రస్తుతం
వరి	17 వేలు	25 వేలు
వేరుశెనగ	17 వేలు	25 వేలు
అరటి	25 వేలు	30 వేలు
చెరకు	17 వేలు	25 వేలు
మిరప	17 వేలు	35 వేలు
బొప్పాయి	17 వేలు	25 వేలు
కూరగాయలు	17 వేలు	25 వేలు
పసుపు	17 వేలు	35 వేలు
పత్తి	17 వేలు	25 వేలు
ఆయిల్‌పామ్	22 వేలు	చెట్టుకి 1,500
కొబ్బరిచెట్టు	1,000	చెట్టుకి 1,500

'వెలుగు'లోకి వస్తున్న అక్రమాలు!

'ఆంధ్రజ్యోతి' వార్తతో కదలిన విజిలెన్సు అధికారులు

7

సూర్యాస్తమయం..

అది సూర్యాస్తమయం.. మెల్లగా సూరీడు కిందకు దిగుతున్నాడు.. గోదావరిపై కిరణాలు ప్రసరిస్తూ కనువిందు చేశాడు. యానాం రాజీవ్‌గాంధీ బీచ్‌లో గౌతమీ గోదావరి వద్ద ఆదివారం కనిపించిన అందమైన దృశ్యాలను 'ఆంధ్రజ్యోతి' కెమెరా క్లిక్ మనిపించిందిలా...

- యానాం (ఆంధ్రజ్యోతి)

కార్తీకం.. రూ.కోటి ఆదాయం!

- సత్యదేవుడి సన్నిధికి ఆదివారం లక్షమంది భక్తుల రాక
- 10,523 వ్రతాలు
- వివిధ విభాగాల ఆలయానికి సమకూరిన రూ.కోటి ఆదాయం



సత్యదేవుడి ఆలయంలో వ్రతాలు ఆచరిస్తున్న భక్తులు



స్వామివారి దర్శనానికి క్యూలో వేచిఉన్న భక్తులు

అన్నవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక మాసం చివరిదశకు చేరుతుండడంతో అన్నవరం సత్యదేవుడి సన్నిధి ఆదివారం అశేష భక్తజనంతో పోటెత్తింది. సత్యదేవుడి వ్రతాల సంఖ్య 10వేలుదాటింది.10,523 వ్రతాలు జరగగా సుమారు లక్షమంది భక్తులు స్వామిని దర్శించుకున్నారు. వివిధ విభాగాల ద్వారా రూ.కోటి ఆదాయం లభించింది. రద్దీని దృష్టిలో ఉంచుకుని 2గంటల నుంచి వ్రతాలు, సర్వదర్శనాలు ప్రారంభించారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా చైర్మన్ రోహిత్ లిఫ్ట్ ప్రాంగణం, ఈవో సుబ్బారావు వ్రత మండపాలు, క్యూలైన్‌లను పర్యవేక్షించారు. రద్దీ అధికంగా ఉండడంతో ఆలయం లోపల ఖాళీ ఆధారంగా హోల్డింగ్ పాయింట్ల నుంచి రథపాత్‌కు వదిలారు. తూర్పురాజగోపురం ఎదురుగా రావిచెట్టు దిగువున ఉన్న గేట్ల ను మూసివేశారు. స్వామివారి ప్రత్యేక దర్శనానికి 3గంటలు, వ్రతంకోసం వచ్చిన భక్తులు వ్రతం, దర్శనం పూర్తవడానికి సుమారు 5గంటలు వేచిఉన్నారు. నిత్యాన్నదాన ట్రస్ట్ ద్వారా 40వేల మందికి ఉచిత పులిహోర ప్రసాదం వితరణ గావించారు.

ఘనంగా రథోత్సవం



రథంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడికి వారాంతపు ఆర్జితసేవయిన రథోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. భక్తుల రద్దీ నేపథ్యంలో ఉదయం జరగాల్సిన రథోత్సవం సాయంత్రం నిర్వహించారు. ప్రధానాలయం నుంచి స్వామి,అమ్మవార్లను తూర్పురాజగోపురం వద్దకు తోడ్కొనివచ్చి ప్రత్యేక పూజలు చేసి అనంతరం పండితుల మంత్రోచ్చరణల నడుమ ముమ్మారు ప్రదక్షిణ గావించారు.

రూ.లక్ష విరాళం

అన్నవరం దేవస్థానంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవ నిత్యాన్నదాన పథకానికి చింతలపూడికి చెందిన చిట్టూరి జయబాబు రూ.1,01,116 విరాళం ఆలయ ఈవో సుబ్బారావుకు అందజేశారు. దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేకదర్శన సౌకర్యం కల్పించారు. కార్యక్రమంలో పీఆర్వో అనకాపల్లి ప్రసాద్ తదితరులున్నారు.



ఈవోకు విరాళం అందజేస్తున్న దాత

ఆరోగ్య ప్రదాత ధన్వంతరి

- చింతలూరులో కొలువైన స్వామివారు
- ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయం
- నేడు జయంతి సందర్భంగా వ్రతం, పూజలు



చింతలూరులో కొలువైన ధన్వంతరిస్వామి



చింతలూరులోని ధన్వంతరి ఆలయం

ఆలమూరు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య ప్రదాతగా, దర్శనభాగ్యంతో సర్వరోగ నివారణ కలిగించే శక్తి గల స్వామిగా శ్రీధన్వంతరి స్వామిని కొలుస్తారు. శ్రీమన్నారాయణుని యేకవింశతి అవతారాల్లో పన్నెండవది ధన్వంతరి అవతారం. ఇంతటి శక్తిగల ధన్వంతరి స్వామివారికి ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఆలమూరు మండలం చింతలూరులో ఉంది. దేవదానవులు అమృత సంపాదనకై క్షీర సాగరాన్ని మధించే తరుణంలో శంఖు, చక్ర, ఔషధ, సుధా కలశాలు నాలుగు హస్తముల ధరించి పాలకడలి నుంచి బయల్పడిన విష్ణుంశసంభూతుడు ధన్వంతరి. దుర్వాసుని శాపంతో రోగభూయిష్టమైన స్వర్గలోకంలో ఆయుర్వేద ప్రచారకుడై, ఆరోగ్య ప్రదాతయై ఆరాధ్యదైవమైనాడు ఈ స్వామి. ధన్వంతరిని ఆయుర్వేద రంగానికి ఆరాధ్య దైవంగా కొలుస్తారు. ఆయన కరుణాకటాక్షాలతోనే ఆయుర్వేద రంగం కొనసాగుతోందని పలువురు ఆయుర్వేద పండితుల విశ్వాసం. ధన్వంతరి స్వామి కటాక్షంతో ఆయుర్వేద పండితుడు, వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం వ్యవస్థాపకులైన వైద్యరాజ ద్విభాష్యం వేంకటేశ్వర్లు భక్తి ప్రపత్తులతో ధన్వంతరిస్వామి ఆలయాన్ని ఆలమూరు మండలం చింతలూరులో 1942లో ప్రతిష్ఠించి నిత్య ధూప, దీప, నైవేద్యాదులకు శ్వాశత భూ వసతి కల్పించారు. వేంకటేశ్వర ఆయుర్వేద నిలయం ప్రస్తుతం మేనేజింగ్ డైరెక్టర్ ద్విభాష్యం వెంకటశ్రీరామమూర్తి ఆధ్వర్యంలో ధన్వంతరి ఆలయాన్ని పునరుద్ధరణ చేసి అభివృద్ధి చేశారు. తెలుగు రాష్ట్రాల్లో ఏకైక ఆలయంగా ఉండడంతో ధన్వంతరీ స్వామిని దర్శించుకోవడానికి అనేక ప్రాంతాల నుంచి ఇక్కడికి వస్తుంటారు. శ్రీధన్వంతరి జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. స్వామివారి దర్శనానికి సుదూర ప్రాంతాల నుంచి చింతలూరు రానున్నారు. ధన్వంతరి వ్రతం, ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరగనున్నాయి.

'లోవ'లో భక్తుల కోలాహలం

రూ.2.46 లక్షల ఆదాయం




దర్శనమిస్తున్న తలుపులమ్మ, క్యూలో బారులుతీరిన భక్తులు

తుని రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని మండలంలో ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. తెలుగు రాష్ట్రాల నలుమూలల నుంచి వేలాదిగా తరలివచ్చిన భక్తులతో ఆలయ ప్రాంగణం భక్తుల కోలాహలంగా మారింది. ప్రత్యేక క్యూలలో బారులుతీరిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. దేవస్థానం ఏర్పాటు వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. వివిధ విభాగాల ద్వారా ఆలయానికి రూ.2.46 లక్షల ఆదాయం సమకూరినట్టు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు.

లారీ ఢీకొని వృద్ధుడి మృతి



మరణించిన ఏసురత్నం

అమలాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురం నుంచి అంబాజీపేట వైపు వెళ్తున్న మోటారు సైకిలిస్టు పరమట ఏసురత్నం (65) కంటైనర్ లారీ వెనుక నుంచి వేగంగా వచ్చి ఢీకొనడంతో అక్కడికక్కడే మృతిచెందినట్టు తాలూకా ఎస్ఐ వై.శేఖర్‌బాబు తెలిపారు. అంబాజీపేట మండలం మాచవరం గ్రామానికి చెందిన ఏసురత్నం ఆదివారం సాయంత్రం పని కోసం మోటారుసైకిల్‌పై అమలాపురం వచ్చాడు. పని ముగించుకుని తిరిగి ఇంటికి బయలుదేరాడు. ప్రధాన ఏజీ రోడ్డుపై బండారులంక అంబేడ్కర్‌నగర్‌కు వచ్చేసరికి కాకినాడ నుంచి భీమవరం వెళ్తున్న అశోక్ లేలాండ్ కంటైనర్ లారీ మోటారుసైకిల్‌ను వెనుక నుంచి ఢీకొంది. ఏసురత్నం తలకు బలమైన గాయం కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతుడి కుటుంబ సభ్యుడు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ శేఖర్‌బాబు పేర్కొన్నారు..

మల్లేపల్లిలో తాచుపాము హతం

గండేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మల్లేపల్లి గ్రామం అనపరాజుపేటలో ఆదివారం రాత్రి గోధుమ తాచుపాము హల్‌చల్ చేసింది. కాలనీకి చెందిన ఆలేటి అప్పారావు ఇంటి లోపలకి పాము ప్రవేశించి చీకట్లో పడగ విప్పి ఉండడంతో స్థానికులు ఒక్కసారిగా చూసి భయాందోళనకు గురయ్యారు. తర్వాత పాము పెంకులోకి దూరడంతో గ్రామస్థులు అక్కడికి చేరుకుని పెంకులు తీసి పామును హతమార్చారు.



గ్రామస్థులు హతమార్చిన తాచుపాము

అక్రిడిటేషన్ కేవలం సర్టిఫికేషన్ కాదు

ఎన్ఈటీఎఫ్, న్యాక్, ఎన్‌బీఏ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్దే



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

జేఎన్టీయూకే, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్‌ను అమలుచేయడం విద్యానాణ్యతను ప్రపంచస్థాయికి తీసుకువెళ్లే మొదటి అడుగని, అక్రిడిటేషన్ అనేది కేవలం సర్టిఫికేషన్ ప్రక్రియ కాదని ఎన్ఈటీఎఫ్, న్యాక్, ఎన్‌బీఏ చైర్మన్ ప్రొఫెసర్ అనిల్ డి.సహస్రబుద్దే అన్నారు. జేఎన్టీయూకే అలూమ్నీ ఆడిటోరియంలో న్యూఢిల్లీలోని ఎన్‌బీఏ, జేఎన్టీయూకే, ఏపీఎస్సీహెచ్ఈ సంయుక్తంగా అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్, అక్రిడిటేషన్‌పై అవగాహన కల్పించేందుకు ఆదివారం వర్క్‌షాప్ నిర్వహించినట్టు పీఆర్వో, రిజిస్ట్రార్ ఆర్.శ్రీనివాసరావు తెలిపారు. గౌరవ అతిథులుగా సహస్రబుద్దే, ఉపకులపతి ప్రొఫెసర్ సీఎస్ఆర్కే ప్రసాద్, ఎన్‌బీఏ కార్యదర్శి డాక్టర్ అనిల్‌కుమార్ నస్సా... అతిథులుగా ఒరిస్సా రాష్ట్ర ఓపెన్ యూనివర్శిటీ వీసీ పట్నాయక్, ఎంఎస్ రామయ్య యూనివర్శిటీ డీన్ రంగనాథ్, డైరెక్టర్ రవీంద్ర పాల్గొన్నారు. సహస్రబుద్దే మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా విద్యార్థులకు శిక్షణనివ్వడం, నేర్చుకున్న దాని ప్రాముఖ్యతను చూపించడం భవిష్యత్‌లో భారత విద్యా వ్యవస్థ లక్ష్యం కావాలన్నారు. ఆర్.మధు, కె.కృష్ణభాస్కర్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్స్, అధ్యాపకులు, డైరెక్టర్లు ఉన్నారు.

కాకినాడలో టైక్వాండో చాంపియన్‌షిప్



క్రీడాకారులతో కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు

కాకినాడ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో రాష్ట్రస్థాయి 39వ సబ్ జూనియర్, 8వ కాండేట్, 41వ సీనియర్ చాంపియన్‌షిప్ పోటీలు కాకినాడ సూర్యకళామందిరంలో ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా 250మంది క్రీడాకారులు హాజరయ్యారు. కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు మాట్లాడుతూ క్రీడాకారులు జాతీయస్థాయిలో రాణించి రాష్ట్ర కీర్తి పతాకాన్ని ఎగురవేయాలని ఆకాంక్షించారు. విద్య, ఉద్యోగాల్లో క్రీడా రిజర్వేషన్ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆంధ్రప్రదేశ్ టైక్వాండో అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్‌కే అబ్దుల్‌సలామ్, డీఎస్‌డీవో సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్రీడలతో రాష్ట్రానికి మంచి గుర్తింపు తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా టైక్వాండో అసోసియేషన్ అధ్యక్షుడు రాయుడు శ్రీను, రాష్ట్ర కోశాధికారి ఎం.లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

భార్య మరణించిన నాలుగు రోజులకే...

విద్యుత్‌షాక్‌తో భర్త మృతి

అల్లూరి జిల్లా గుండాల గ్రామంలో ఘటన



మృతిచెందిన వెంకటేశ్వర్లు

ఎటపాక, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో మహిళ చనిపోయిన బాధ నుంచి కుటుంబం తెరుకోకముందే ఆ ఇంట్లో మరో విషాదం జరిగింది. కేవలం నాలుగు రోజుల వ్యవధిలోనే అనుకోని ప్రమాదంతో ఇంటి పెద్ద దిక్కును కోల్పోవల్సి వచ్చింది. ఈ ఘటన అల్లూరి జిల్లా ఎటపాక మండలం గుండాల గ్రామంలో జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బాసిబోయిన సుబ్బలక్ష్మి నాలుగు రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆమె పెద్ద కర్మ (కార్యం) ఈనెల 24న కుటుంబసభ్యులు చేయనున్నారు. కార్యక్రమం కోసం ఆదివారం మృతురాలి భర్త బాసిబోయిన వెంకటేశ్వర్లు (56), అతడి కొడుకు ఇంటి ఆవరణలో ఉన్న స్థలాన్ని శుభ్రం చేస్తున్నారు. ఇంటి ఆవరణలో 33 కేవీ విద్యుత్ లైన్ ఉండగా దాని కింద భా గాన ఫైబర్‌నెట్ (కేబుల్స్) ఉన్నాయి. ఇంటికి చెందిన విద్యుత్ సర్వీసు వైరు కింద కు వేలాడుతూ ఉండగా దానిని ఫైబర్‌వైరుతో కలిపి కట్టేందుకు ఇం ట్లో ఉన్న పాత విద్యుత్ వైర్లు తెచ్చి పైకి లాగి కట్టే క్రమంలో వెంకటే శ్వర్లుకు ఫైబర్ వైర్ల పైన ఉన్న 33కేవీ విద్యుత్ వైర్లకు విసిరిన పాత సర్వీస్ వైరుకు ప్రమాదవశాత్తు తగిలి షాక్ కొట్టిం ది. కాలిన గాయాలైన వెంకటేశ్వర్లును కుటుంబసభ్యులు వెంటనే భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే అప్పటికే అతడు మృతిచెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. 4రోజుల వ్యవధిలో దంపతులు మృతిచెందడంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సివిల్స్ పరీక్షలకు ఉచిత శిక్షణ

రాజమహేంద్రవరం అర్బన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): యూపీఎస్సీ నిర్వహించే సివిల్స్ ప్రిలిమనరీ, మెయిన్స్ పరీక్షలకు అర్హత కల్గిన తూర్పుగోదావరి జిల్లా వాసులకు విజయవాడలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు రాజమహేంద్రవరంలోని బీసీ స్టడీ సర్కిల్ సంచాలకులు బి.శశాంక తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేస్తూ ఈ ఉచిత శిక్షణకు బీసీ, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులు మాత్రమే అర్హులని... దరఖాస్తులను నవంబరు 25వ తేదీలోగా రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల పక్కన ఉన్న బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. డిసెంబరు 5న స్క్రీనింగ్ పరీక్ష నిర్వహిస్తారని, అందులో ఉత్తీర్ణులైనవారికి మెరిట్ ఆధారంగా, రిజర్వేషన్ ప్రాతిపదికన ఎంపిక చేసి విజయవాడ గొల్లపూడిలోని బీసీ భవన్‌లో ఉచిత శిక్షణ ఇస్తారని తెలిపారు. మరిన్ని వివరాలకు నేరుగా బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో కానీ.. సెల్ నెంబర్లు 9494452267, 9000058102లో సంప్రదించాలని శశాంక తెలియజేశారు.

'వెలుగు'లోకి వస్తున్న అక్రమాలు!

స్త్రీనిధి రుణాలు అవకతవకలపై విచారణ

ఆంధ్రజ్యోతి వార్తతో కదిలిన విజిలెన్సు అధికారులు



డ్వాక్రా సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న అధికారులు

పిఠాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): వెలుగు సంస్థలో అక్రమాలు ఒక్కొక్కటిగా బయటకొస్తున్నాయి. శ్రీనిధి రుణాల స్వాహాపర్వంపై విచారణకు అధికార యంత్రాంగం కదిలింది. ఈనెల 14న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన వెలుగు చూసేనా కథనానికి స్పందించి విజిలెన్సు బృందం తనిఖీలు చేస్తుంది. ఇందులో భాగంగా ఆదివారం కాకినాడ జిల్లా పిఠాపురం మండలం వెల్దుర్తి, బి.కొత్తూరు గ్రామాల్లో శ్రీ నిధి రుణాలపై విచారణ చేపట్టారు. గ్రామంలో రుణాలు తీసుకుని గత రెండేళ్లుగా చెల్లించని మొండి బకాయిలపై ఆరా తీశారు. పాత వీఏవో పద్మ చేసిన అవకతవకలు ఒక్కొటిగా బయటపడడంతో విచారణ మరింత ముందుకెళ్లింది. బి.కొత్తూరులో సుమారు రూ.19లక్షలు మొండి బకాయిలున్నాయని, వెల్దుర్తిలో రూ.8లక్షలు ఉన్నట్లు గుర్తించారు. వీటి వసూళ్లకై విజిలెన్సు రికవరీ బృందం వెళ్లగా అనేక అక్రమాలు బయటపడుతున్నాయి. సభ్యులు ఒకరైతే రుణం పొందింది మరొకరని, రుణాలు తీసుకుని చెల్లించినప్పటికీ బకాయిలు ఇంకా చూపిస్తున్నాయనే విషయాలు అధికారులు విచారణలో బయటకొచ్చాయి. కార్యక్రమంలో శ్రీనిధి డీజీఎం శ్యామల, సెర్ప్ శ్రీనిధి మేనేజర్లు భవానీ, కస్తూరి, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

వాట్సాప్‌లో పరిచయం.. హోటల్‌లో అత్యాచారం!

వ్యక్తిపై పోక్సో కేసు నమోదు

సీతానగరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తూర్పుగోదావరి జిల్లా సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన 17 ఏళ్ల బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు అదే గ్రామానికి చెందిన గడుసుల నాగ వెంకటేష్‌పై పోక్సో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ డి.రామ్‌కుమార్ పేర్కొన్నారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. బాలిక ఇంటర్ చదివి విశాఖపట్నంలో ఎయిర్ హోస్టెస్‌గా శిక్షణ తీసుకుంటుంది. వాట్సాప్ ద్వారా నాగ వెంకటేష్‌తో పరిచయం ఏర్పడింది. ఆమెను పలు మార్లు విశాఖపట్నం తీసుకెళ్లడం చేసేవాడు. పరిచయం పెరగడంతో హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ ఉందని చెప్పాలని వెంకటేష్ ఒత్తిడి మేరకు బాలిక తల్లిదండ్రులతో హైదరాబాద్‌లో ఇంటర్వ్యూ ఉందని చెప్పించి అక్కడకు తీసుకెళ్లాడు. హైదరాబాద్ ఎల్‌బీనగర్‌లో గత నెల 31 నుంచి వారిద్దరు హోటల్‌లో ఉన్నారు. శారీరకంగా కలవడానికి ఒత్తిడి చేయడంతో బాలిక తిరస్కరించింది. సామాజిక మాధ్యమాల్లో ఫోటోలు అప్‌లోడ్ చేస్తానని బాలికను వెంకటేష్ బెదిరించి అత్యాచారానికి పాల్పడ్డాడు. తిరిగి ఈనెల 3న ఇంటికి చేరగా తల్లిదండ్రులకు బాలిక విషయం చెప్పడంతో వెంకటేష్ ఇంటి వద్దకు వెళ్లారు. వెంకటేష్ తల్లి కులంపేరుతో దూషిస్తూ దుర్భాషలాడింది. దీంతో ఆదివారం బాలిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు వెంకటేష్‌తో పాటు అతడి తల్లిపైన కేసు నమోదు చేశామని.. నార్త్‌జోన్ డీఎస్పీ శ్రీకాంత్ దర్యాప్తు చేస్తారని ఎస్ఐ పేర్కొన్నారు.

కంప్యూటేషనల్ థింకింగ్ ప్రాథమిక నైపుణ్యం

జేఎన్టీయూకే, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం ప్రపంచంలో కంప్యూటేషనల్ థింకింగ్ ఒక ప్రాథమిక నైపుణ్యమని విద్యార్థుల్లో సమస్యలను పరిష్కరించే శక్తిని పెంచుతుందని డీవీఎస్ఎం చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు డాక్టర్ డి.హరిప్రసాద్ తెలిపారు. జేఎన్టీయూకే వర్శిటీలోని యూసీఈకే సెమినార్ హాల్లో ఎన్ఎస్ఎస్ యూనిట్లు, యూసీఈకే, డీవీఎస్ఎం ట్రస్ట్ సంయుక్తంగా ఆదివారం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హరిప్రసాద్ మాట్లాడుతూ నేర్చుకున్న అంశాలను పాఠశాలల విద్యార్థులతో పంచుకుంటే వారు చిన్న వయస్సులోనే నూతన ఆలోచనలతో ముందుకుసాగగలరన్నారు. ఎన్ఎస్ఎస్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ మాట్లాడుతూ ఎన్ఎస్ఎస్ కార్యకలాపాలు విద్యార్థుల్లో సేవాభావాన్ని పెంపొందిస్తాయన్నారు. ఎన్ఎస్ఎస్ అధికారులు, అధ్యాపకుల ఉన్నారు.



మాట్లాడుతున్న డాక్టర్ హరిప్రసాద్

కాకినాడ

• కాకినాడ సిటీ • రూరల్ • పిఠాపురం • పెద్దాపురం

మరిడమ్మ దేవస్థానంలో అన్నదానం



పెద్దాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని మరిడమ్మ దేవస్థానంలో ఆదివారం అన్నదానం నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చిన సుమారు 500 మంది భక్తులు అన్నప్రసాదం స్వీకరించారని సహాయ కమిషనరు కె.విజయలక్ష్మి తెలిపారు. నిత్యాన్నదానానికి దాతలు సహకరించాలని కోరారు. ఆలయ సిబ్బంది రమణ, క్రాంతివీర్ పాల్గొన్నారు.



కాకినాడ రూరల్‌లో కాపు సద్భావనా సంఘం గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావును సత్కరిస్తున్న ఎమ్మెల్యే పంతం నానాజీ





కాకినాడలో జరిగిన పద్మశాలీ సంక్షేమ సంఘం వనసమారాధనలో ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరాన్ని సత్కరిస్తున్న నాయకులు, జిల్లా పరిషత్ సీఈవో లక్ష్మణరావు దంపతులకు జ్ఞాపిక అందజేస్తున్న ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ

వనమంతా సందడి

కార్తీక మాసం చివరి ఆదివారం పలు కుల సంఘాల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధనలు

సర్పవరం జంక్షన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎన్ఎఫ్‌సీఎల్ రోడ్డులో ఆంధ్ర కాపు సద్భావనా సంఘం, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ ఆధ్వర్యంలో కాపు వన సమారాధన ఆదివారం ఉల్లాసంగా, ఉత్సాహంగా జరిగింది. జిల్లా నలుమూలల నుంచి వేలాది మంది కాపు సామాజిక వర్గీయులు కుటుంబ సభ్యులతో సహా హాజరై ఆటపాటలతో ఆనందంగా గడిపారు. శమీ పూజ అనంతరం శివలింగం వద్ద ప్రత్యేక పూజలు, విశేష ద్రవ్యాలతో అభిషేకాలు నిర్వహించారు. ఎమ్మెల్యే నానాజీ ఆధ్వర్యంలో చిన్నారులకు, మహిళలకు పలు రకాల ఆటలు, నృత్య, క్విజ్ పోటీలు నిర్వహించారు. విజేతలకు విలువైన బహుమతులను ఎమ్మెల్యే నానాజీ, ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అందించారు. శివునికి నేవైద్యంగా సమర్పించిన అన్న ప్రసాదాన్ని వనసమారాధనలో స్వీకరించారు. సుమారు 17వేల మంది హాజరైనట్టు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు, సివిల్ సప్లయిస్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ తోట సుధీర్, మాజీ ఎంపీ వంగా గీత, ఖాదీ-విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, కాపు సద్భావనా సంఘం గౌరవాధ్యక్షుడు బసవా ప్రభాకరరావు, కార్యదర్శి చిట్నీడి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు సలాది మూర్తి, రంబాల వెంకటేశ్వరరావు, చిలుకూరి రామ్‌కుమార్, జానపాముల నాగబాబు, గట్టి సత్యనారాయణ, దుగ్గన బాబ్జీ, సంగిశెట్టి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

కాకినాడ హరేకృష్ణ మూవ్‌మెంట్ ప్రెసిడెంట్ డాక్టర్ నిష్కించన భక్తదాస ఆధ్వర్యంలో కాకినాడ రూరల్ సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్ రత్నగిరి రిసార్టులో సుమారు 300 మంది విద్యార్థులు, భక్తులతో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్తీక మాసంలో వనభోజనాలు చేయడమనేది మన సంస్కృతిలో భాగమన్నారు. మానసిక ఉత్తేజం, వికాసం కోసం పలు విన్యాసాలు చేయించారు. హరినామ సంకీర్తనలు, వివిధ సంగీత పరికరాలతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. టగ్ ఆఫ్ వార్ ఎంతో ఉత్సాహంగా జరిగింది. అనంతరం సామూహికంగా వన భోజనాలు చేశారు.

కాకినాడ సిటీ (ఆంధ్రజ్యోతి): కాకినాడ నగర పద్మశాలీ సంక్షేమ సంఘం 43వ కార్తీక వన సమారాధన భాస్కర్‌నగర్‌లోని సంఘ భవనం ఆవరణలో ఉల్లాసభరిత వాతావరణంలో జరిగింది. ముందుగా సంఘ నాయకులు ఉసిరి చెట్టు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముఖ్య అతిథులుగా విచ్చేసిన ఎమ్మెల్సీలు పేరాబత్తుల రాజశేఖరం, కర్రి పద్మశ్రీ మాట్లాడుతూ పద్మశాలీల సమస్యల పరిష్కారానికి, సంఘ భవన నిర్మాణానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. సంక్షేమ సంఘం అధ్యక్షుడు వింజమూరి వెంకట సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి కొల్లు వెంకటేశ్వరరావు, కోశాధికారి వల్లభదాసు శివాజీ గణేష్, ఆల్ ఇండియా వీవర్స్ ఫెడరేషన్ జాతీయ కార్యవర్గ సభ్యుడు పప్పు దుర్గారమేష్ మాట్లాడుతూ పద్మశాలీ సంక్షేమ సంఘానికి ప్రభుత్వం కేటాయించిన స్థలంలో త్వరలో నూతన భవనం నిర్మిస్తామని చెప్పారు. జిల్లా పరిషత్ సీఈవో వీవీఎస్ లక్ష్మణరావు, చేయూత సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ మొండి రవికుమార్‌లను శాలువాలతో సత్కరించారు. అనంతరం మహిళలకు, పిల్లలకు ఆటలు, క్విజ్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో పద్మశాలీ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు వింజమూరి భాస్కరరావు, న్యాయ విభాగం అధ్యక్షుడు జగ్గారపు మల్లికార్జున, సంఘ నాయకులు పొన్నగంటి సత్యనారాయణ, చుక్కల రామారావు, బొజ్జా శ్రీశైలం, మంచంశెట్టి నటరాజ్, పందిరి బాబీ, చిలుకోటి రామ్మోహనరావు, సీరం ప్రసాద్, కొల్లి శివనాగేశ్వరరావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్‌పర్సన్ బడిగంటి దేవి, కాదా సరోజిని, కడారి భవానీ, పలివెల లక్ష్మీరాజ్, తుమ్మ కుమారి, అధిక సంఖ్యలో సంఘీయులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రామారావుపేటలో బ్రాహ్మణ సేవా సంఘం కార్తీక వనసమారాధన ఘనంగా జరిగింది. ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు హాజరయ్యారు. విందు భోజనాలు చేశారు. బ్రాహ్మణ సేవా సంఘం అధ్యక్షుడు పాణింగపల్లి చలపతిరావు, సభ్యులు పాల్గొన్నారు.

కొత్తపల్లి (ఆంధ్రజ్యోతి): నిత్యం పని ఒత్తిడితో సతమతమయ్యే న్యాయవాదులకు ఆహ్లాద వాతావరణం ఎంతో అవసరమని 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీహరి అన్నారు. మండలంలోని పొన్నాడ శివారు కోనపాపపేటలో ఆదివారం జరిగిన పిఠాపురం బార్ అసోసియేషన్ న్యాయవాదుల కార్తీక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. న్యాయవాదులకు వివిధ రకాల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. పిఠాపురం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మేరుగు రాజారావు, పలువురు న్యాయవాదులు పాల్గొన్నారు.

కొత్తపల్లి మండలంలోని వాకతిప్ప సూరప్ప చెరువు ఆవరణలో రక్షిత మంచినీటి పథకం కాకినాడ డివిజన్ అధికారుల ఆధ్వర్యంలో కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఉసిరి చెట్టు కింద ఏర్పాటుచేసిన శివుని చిత్రపటానికి పూజలు చేశారు. అధికారులు, సిబ్బంది కుటుంబసభ్యులు, పిల్లలు పలు రకాల ఆటలు ఆడారు. అనంతరం అన్నసమారాధనలో డీఈఈలు, జేఈఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

తాళ్లరేవు (ఆంధ్రజ్యోతి): పిల్లల విద్యాభివృద్ధిపై తల్లిదండ్రులు శ్రద్ధ చూపిస్తే వారి ఎదుగుతలకు కారణమవుతారని ఎమ్మెల్సీ పేరాబత్తుల రాజశేఖరం అన్నారు. తెలగా అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన 25వ కార్తీక వనసమారాధనకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సాంస్కృతిక ప్రదర్శనల్లో విజేతలకు బహుమతులు అందించారు.

సామర్లకోట (ఆంధ్రజ్యోతి): సామర్లకోట విస్తరణ శిక్షణ కేంద్రం ఆవరణలో కాపు వనసమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప, డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి (బాబు), బీజేపీ నాయకుడు డాక్టర్ గొరకపూడి చిన్నయ్యదొర హాజరయ్యారు. కాపు నాయకుల సౌజన్యంతో పేద విద్యార్థులకు నగదు సహాయం అందజేశారు. ఆటపాటలతో సందడిగా గడిపారు. సుమారు 4వేల మంది విందు స్వీకరించారు.



కాకినాడ రూరల్ సూర్యారావుపేట బీచ్‌లో టగ్ ఆఫ్ వార్‌లో పాల్గొన్న యువకులు



పెద్దాపురంలో బ్రాహ్మణ సేవా సంఘ కార్తీక వనసమారాధనలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చినరాజప్ప



కొత్తపల్లి మండలం ఉప్పాడ తీరంలో జరిగిన న్యాయవాదుల వనసమారాధనలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న జిల్లా జడ్జి శ్రీహరి



సామర్లకోటలో జరిగిన కాపు వనసమారాధనలో మాట్లాడుతున్న పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప, పోటీలో విజేతగా చిన్నారికి బహుమతి అందజేస్తున్న డీసీసీబీ చైర్మన్ తుమ్మల బాబు



విద్యార్థుల అ'పూర్వ' కలయిక

పిఠాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రాజీవ్‌గాంధీ మున్సిపల్ హైస్కూలు 1992-93 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు ఆదివారం విరవాడ రోడ్డులో ఆత్మీయ సమ్మేళనం జరుపుకున్నారు. వివిధ ఉద్యోగాల్లో స్థిరపడ్డ వారంతా అప్పట్లో చేసిన అల్లరి పనులను గుర్తు చేసుకున్నారు. కష్టసుఖాలు తెలుసుకుని ఒకరికొకరు భరోసా ఇచ్చుకున్నారు. అవసరాల రామారావు, సాగి మల్లేశ్వరరావు, రేవాడ నాని, టి.కేదారేశ్వరరావు ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది.

వ్యాసరచన పోటీలు

కలెక్టరేట్ (కాకినాడ), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా జగన్నాథపురం శాఖ గ్రంథాలయంలో విద్యార్థులకు గ్రంథాలయ ఆవశ్యకత, పర్యావరణ పరిరక్షణ అంశాలపై వ్యాసరచన పోటీలు ఆదివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన వికాసానికి ఎంతో దోహదపడతాయన్నారు. విద్యార్థులు గ్రంథాలయాల సందర్శన ద్వారా కొత్త విషయాలు తెలుసుకోగలరన్నారు. పుస్తక పఠనం ద్వారా జ్ఞానాన్ని పొందవచ్చన్నారు. కార్యక్రమంలో లైబ్రేరియన్లు అంబటి వెంకటనారాయణ, ములంపాక శ్రీనివాసరావు, అధ్యాపకురాలు మహాలక్ష్మి పాల్గొన్నారు.



మీరయ్యస్వామికి స్వాగతం పలుకుతున్న గణేశ ఉత్సవ కమిటీ సభ్యులు

'కల్తీ నెయ్యి వ్యవహారంపై చర్యలు తీసుకోవాలి'

కార్పొరేషన్ (కాకినాడ), నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): నిషేధిత సంస్థతో కుమ్మక్కై తిరుమల వేంకటేశ్వరస్వామికి కల్తీ నెయ్యి సరఫరా జరిగినట్టు ఆరోపణలు ఎదురవుతున్న నేపథ్యంలో బాధ్యులపై చర్యలు తీసుకోవాలని మీరయ్య స్వామి డిమాండ్ చేశారు. కాట్రేనికోన మండలం పల్లాం నుంచి తుని మండలం అన్నవరం వరకు ఆయన హిందూ భక్తులతో కలిసి సనాతన ధర్మ పరిరక్షణ కోసం పాదయాత్ర నిర్వహించారు. కాకినాడలో నగర గణేశ ఉత్సవ సమితి జిల్లా అధ్యక్షుడు యెనిమిరెడ్డి మాలకొండయ్య, మాజీ అధ్యక్షుడు దువ్వూరి సుబ్రహ్మణ్యం స్వామికి స్వాగతం పలికి పాదయాత్రలో పాల్గొన్నారు.



సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కుల అందజేత

సర్పవరం జంక్షన్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.10,98,249 చెక్కుల రూపంలో 18 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే పంతం నానాజీ ఆదివారం అందించారు. ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ బోర్డు రాష్ట్ర డైరెక్టర్ శిరంగు శ్రీనివాసరావు, పుల్ల శ్రీరాములు, పాండ్రంకి రాజు తదితరులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్‌లో 25 అర్జీలు స్వీకరణ

సామర్లకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన గ్రీవెన్స్‌కు 25 అర్జీలు వచ్చినట్టు నాయకులు అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్ (బాబు) తెలిపారు. ఒక దివ్యాంగుడు తన సమస్యను విన్నవించేందుకు ఆటోలో రాగా ఎమ్మెల్యే చినరాజప్ప నేరుగా వెళ్లి అర్జీ స్వీకరించి సత్వర పరిష్కారానికి అధికారులకు సిఫారసు చేశారు. బ్రౌన్‌పేటలో ఉన్న కనకదుర్గమ్మ అమ్మవారికి ఆలయం నిర్మించి పలు సామాజికవర్గాల ద్వారా ఆధ్యాత్మిక సేవలు విస్తరిల్లేలా సహకరించాలని ఆలయ కమిటీ గౌరవాధ్యక్షులు నూతలపాటి అప్పలకొండ, చెక్కా అబ్బాయి, సింహాచలం, సాకేటి సత్యంనాయుడు వినతి పత్రం అందజేశారు.

రహదారి నిర్మాణానికి శంకుస్థాపన

తాళ్లరేవు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): సుంకరపాలెం బైపాస్ సెంటరు నుంచి ద్రాక్షారామ-వెల్ల వరకు రూ.1.80 కోట్లతో రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ఆదివారం శంకుస్థాపన చేశారు. సర్పంచ్ టిల్లపూడి నాగేశ్వరరావు అధ్యక్షతన యానాం-సుంకరపాలెం రోడ్డు నిర్మాణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి మోపూరి వెంకటేశ్వరరావు, వేగేశ్న భాస్కరరాజు, రాష్ట్ర శెట్టిబలిజ కార్పొరేషన్ డైరెక్టర్ టేకుమూడి లక్ష్మణరావు, గ్రామ కమిటీ అధ్యక్షుడు నాగాబత్తుల బాలకృష్ణ, సొసైటీ అధ్యక్షుడు మోపూరి రెడ్డినాయుడు, ఆకెళ్ల నాగేశ్వరరావు, వుంగరాల వెంకటేశ్వరరావు, మత్యాల జయలక్ష్మి పాల్గొన్నారు.

నేడు ఐఎఫ్‌టీయూ ధర్నా

కాకినాడ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు పని గంటలను పెంచుతూ కూటమి ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి జీవో విడుదల చేయడాన్ని వ్యతిరేకిస్తూ రాష్ట్రవ్యాప్త ఆందోళనలో భాగంగా కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం తలపెట్టిన ధర్నాను విజయవంతం చేయాలని నాయకులు కోరారు. సంబంధిత కరపత్రాలను జె.వెంకటేశ్వర్లు ఆదివారం ఆవిష్కరించారు.



పాదయాత్రను ప్రారంభిస్తున్న డీసీసీబీ చైర్మన్ రామస్వామి

గొల్లప్రోలు టు అన్నవరం... మహా పాదయాత్ర

గొల్లప్రోలు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): గొల్లప్రోలులోని విజయదుర్గమ్మ ఆలయం నుంచి అన్నవరం సత్యనారాయణస్వామి దేవస్థానం వరకు ఆదివారం చేపట్టిన మహా పాదయాత్ర విజయవంతమైంది. దీనిని ఉదయం తొమ్మిది గంటలకు డీసీసీబీ చైర్మన్ తుమ్మల రామస్వామి, పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు ప్రారంభించారు. గొల్లప్రోలులో 500 మందితో పాదయాత్ర మొదలవ్వగా చేబ్రోలు సత్తెమ్మ తల్లి ఆలయం వద్దకు వెళ్లేసరికి 2వేల మందితో సాగింది. భక్తులకు మాజీ ఎమ్మెల్యే దొరబాబు చేబ్రోలు శివారులో అల్పాహారం, అన్నవరంలో సాయిప్రియ సేవా సమితి అధ్యక్షుడు జ్యోతుల శ్రీనివాస్ భోజనాలు ఏర్పాటుచేశారు. పాదయాత్ర ముగించుకుని తిరుగు ప్రయాణమయ్యే భక్తుల కోసం ఆలయ కమిటీ వాహనాలను సిద్ధం చేసింది. మహా పాదయాత్ర కమిటీ ప్రతినిధులు గొల్లపల్లి గంగాధరరావు, మామిడాల సూరిబాబు, అక్కిరెడ్డి శ్రీనివాస్, గొల్లపల్లి చినకొండలరావు, కీర్తి వెంకటరమణ, కూరాకుల చంద్రరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సగర కుల అభివృద్ధికి కృషి'

పిఠాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో సగర కుల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని డైరెక్టర్లుగా నియమితులైన మొగిలి అప్పారావు, ములికి సూరిబాబు పేర్కొన్నారు. ఆదివారం వారికి పట్టణంలోని సూర్యరాయ గ్రంథాలయంలో సన్మాన సభ జరిగింది. చంద్రబాబు, పవన్‌కల్యాణ్ చొరవతోనే తమకు పదవులు దక్కాయని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. సగర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ములికి సత్యనారాయణ, సభ్యులు ఏపూరి శ్రీనివాసరావు, రాఘవరావు, నక్కా అప్పారావు, కిషోర్, గుర్రం మహాలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సగర కార్పొరేషన్ డైరెక్టర్లు అప్పారావు, సూరిబాబులను సన్మానిస్తున్న దృశ్యం

భోగాపురంలో కార్తీక పూజలు

పిఠాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం మండలం భోగాపురంలో ఉమాభోగలింగేశ్వరస్వామికి ఆదివారం అభిషేకాలు, అర్చనలు జరిగాయి. సుమారు 300 మహిళలు పెద్ద ఎత్తున బిందెలు, కలశాలతో నీటిని తీసుకొచ్చిన స్వామివారికి కుంభాభిషేకం నిర్వహించారు. ఆలయ అర్చకుడు చాగంటి ప్రసాద్ మాట్లాడుతూ ఊరి చెరువు మధ్యలో ఉండే భోగలింగేశ్వర లింగాన్ని తీసుకొచ్చి 70ఏళ్ల క్రితం ఆలయ నిర్మాణం చేపట్టి పూజలు చేస్తున్నట్టు చెప్పారు.



భోగలింగేశ్వర స్వామికి అభిషేకం చేస్తున్న అర్చకస్వామి

చొల్లంగిపేటలో భూ వివాదం

తాళ్లరేవు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి పక్కన చొల్లంగిపేట సర్వే నెం.42/13 (బి)లో 12సెంట్ల భూమికోసం యేరుపల్లి సూర్యనారాయణ, ఖైదు హరిబాబు వర్గాల మధ్య ఆదివారం వివాదం జరిగింది. సూర్యనారాయణ వర్గం ఎక్స్‌కవేటరుతో నాన్ లే ఔట్ పనులు చేస్తుంటే హరిబాబు వర్గం అడ్డుకుంది. దీంతో ఘర్షణ చోటుచేసుకుంది. హరిబాబు కోరింగ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



కాకినాడ, పెద్దాపురంల్లో గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న అధికారులు, విద్యార్థులు

గ్రంథాలయ ఉద్యమకారులకు నివాళి

కాకినాడ సిటీ, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హాజరైన ఏపీ రెసిడెన్షియల్ కాలేజీ రిటైర్డ్ జూనియర్ లెక్చరర్ ఎన్.పెద్దిరాజు, వయోజన విద్యా శాఖ అసిస్టెంట్ ప్రాజెక్టు ఆఫీసర్ వి.త్రిమూర్తులు, ఘంటసాల పురస్కార అవార్డు గ్రహీత మేడిశెట్టి శ్రీరాములు, డీఆర్పీ శిక్షణ నిపుణురాలు ఎం.సత్యబాల ప్రసంగించారు. విద్యార్థులకు జూనియర్స్, సీనియర్స్ విభాగాల్లో దేశ భక్తి, జానపద గేయాల పోటీలు నిర్వహించారు. తొలుత గ్రంథాలయ ఉద్యమకారుల చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా కేంద్ర ఉప గ్రంథాలయాధికారి కె.కిషోర్, సీనియర్ అసిస్టెంట్ ఎం.శ్రావ్య, సిబ్బంది, అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

పెద్దాపురం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రథమ శ్రేణి శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయ ఉద్యమకారుల సంస్మరణ సభ నిర్వహించారు. ప్రముఖ చారిత్రక పరిశోధకుడు వంగలపూడి శివకృష్ణ, అభ్యుదయ కవి చల్లా విశ్వనాథం, భళ్లమూడి సూర్యనారాయణమూర్తి ముఖ్య అతిథులుగా హాజరై గ్రంథాలయ ఉద్యమకారులైన అయ్యంకి వెంకటరమణయ్య, గాడిచర్ల హరిసర్వోత్తమరావు, పాతూరి నాగభూషణం, ఎస్ఆర్ రంగనాథన్ చిత్రపటాలకు నివాళులర్పించారు. సాహితీ స్రవంతి పట్టణ కార్యదర్శి కొత్త శివ (అప్పారావు) అధ్యక్షతన జరిగిన సదస్సులో వారు మాట్లాడుతూ ప్రజలను విజ్ఞానవంతులు చేసేందుకు గ్రంథాలయ ఉద్యమం ఉపయోగపడిందన్నారు. గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు, సిబ్బంది సింగంబుల్లయ్య, పాఠకులు పాల్గొన్నారు.

'జిల్లా మహాసభను విజయవంతం చేయాలి'

పిఠాపురం రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తాళ్లరేవులో జరిగే వ్యవసాయ కార్మిక సంఘ జిల్లా మహాసభను విజయవంతం చేయాలని జిల్లా కార్యదర్శి కేఎస్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం పిఠాపురం మండలం పి.రాయవరంలో నాయకుడు సింహాచలం ఆధ్వర్యంలో మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రకారం బడుగు, బలహీన వర్గాలకు పట్టణాల్లో రెండు సెంట్లు, గ్రామాల్లో మూడు సెంట్లు భూమిని ఇళ్ల స్థలాలుగా ఇవ్వాలని డిమాండ్ చేశారు. దళితుల చేతుల్లో ఉన్న ప్రభుత్వ అసైన్డ్ భూములను సంపన్నులకు కట్టబెట్టే ఫ్రీ హోల్డ్ జాబితాపై నిషేధం ఎత్తివేయాలన్నారు. ఊబ బుల్లబ్బాయి, రుద్రవరపు భూలోకం, కాల్దారి రాఘవ, కృష్ణ, మామిడి ఆశీర్వాదం, డెక్కల లాజరు, బోడ మహాలక్ష్మి, తంగేటిపల్లి పాపా, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

20న భవన నిర్మాణ కార్మికుల ధర్నా

పెద్దాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 20న కాకినాడ కలెక్టరేట్ వద్ద జరిగే ధర్నాను జయప్రదం చేయాలని పాండవగిరి పెయింటింగ్ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ అనుబంధం) అధ్యక్షుడు వడ్డి సత్యనారాయణ పిలుపునిచ్చారు. సంబంధిత గోడపత్రికను ఆయన ఆవిష్కరించారు. గూనురు రమణ, కరణం అప్పన్న, యాసలపు మహేష్, సివి చందు, ఆలీ తదితరులు పాల్గొన్నారు.

పెట్టుబడుల రాకతో ఉపాధి అవకాశాల వెల్లువ

పెద్దాపురం ఎమ్మెల్యే చినరాజప్ప

సామర్లకోట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఐటీ, సాఫ్ట్‌వేర్, ఏఐ రంగాల్లో పెట్టుబడులు పెట్టేందుకు బడా పారిశ్రామిక వేత్తలు సుముఖత చూపుతుండడంతో ఉపాధి అవకాశాలు వెల్లువెత్తుతాయని పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్ప పేర్కొన్నారు. విశాఖలో జరిగిన సీఐఐ సదస్సులో పాల్గొన్న అనంతరం ఆదివారం సామర్లకోట చేరుకున్న ఆయన ఆదివారం రాత్రి టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో గ్రీన్‌ఎనర్జీ ఉత్పత్తి చేయడం ద్వారా పరిశ్రమలు వచ్చేందుకు ప్రభుత్వం ప్రణాళికలు వేసిందన్నారు. వ్యవసాయాధార పరిశ్రమలు మరింత ప్రగతి సాధించేందుకు, ఇప్పటికే ఉన్న పరిశ్రమదారులు తమ ఉత్పత్తులను మరింత పెంచేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకున్నారన్నారు. టీడీపీ నాయకులు రాజా సూరిబాబురాజు, అడబాల కుమారస్వామి, బడుగు శ్రీకాంత్, కంటే జగదీష్ మోహన్ (బాబు), మునిరెడ్డి శ్రీరాములు, బలుసు శ్రీనివాసు, పిల్లాడి సత్యవతి, మొయిళ్ల కృష్ణమూర్తి, నూనె రామారావు, ఎండీ సైపుల్లా తదితరులు పాల్గొన్నారు.

సీఐఐ సదస్సు సూపర్‌హిట్

చంద్రబాబుపై నమ్మకంతోనే పారిశ్రామిక పెట్టుబడులు: మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): విశాఖపట్నంలో జరిగిన సీఐఐ సదస్సు సూపర్ హిట్ అయ్యిందని, ముఖ్యమంత్రి చంద్రబాబుపై నమ్మకంతోనే పారిశ్రామికవేత్తలు పెట్టుబడులు పెట్టేందుకు ముందుకొచ్చారని టీడీపీ అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అన్నారు. పట్టణంలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలోని యు.కొత్తపల్లిలో ఏఎంజీ గ్రీన్ మెటీరియల్స్ పరిశ్రమ స్థాపనకు రూ.41వేల కోట్లతో ఒప్పందం జరిగిందని, దీంతో 3వేల మందికి ఉద్యోగావకాశాలు వస్తాయన్నారు. కాకినాడ మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ విభాగంలో రూ.1625 కోట్లతో ఏసీఈ కాకినాడ హిల్స్ సిటీ నిర్మాణంతో 10వేల మందికి ఉపాధి దక్కుతుందన్నారు. టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షుడు బొజ్జా సతీష్, నీటి సంఘం చైర్మన్ సోము సత్యనారాయణ, జనరల్ సెక్రటరీ కొరుప్రోలు శ్రీను, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు పిల్లి చిన్న, ఐటీడీపీ అధ్యక్షుడు మూర్తి, ఎస్సీ సెల్ అధ్యక్షుడు సిద్ధాంతపు ప్రదీప్, యర్రంశెట్టి శ్రీను పాల్గొన్నారు.

రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

పిఠాపురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పిఠాపురం సర్కిల్‌లో వివిధ కేసుల్లో పాత నేరస్తులు, చెడు నడవడిక కలిగిన రౌడీ షీటర్లకు ఆదివారం పిఠాపురం పట్టణ పోలీసు స్టేషన్లో సీఐ శ్రీనివాస్ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఎస్ఐలు మణికుమార్, వెంకటేష్, జానీబాషా తదితరులు పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

రౌతులపూడి, నవంబరు16(ఆంధ్రజ్యోతి): అసాంఘిక కార్యక్రమాలకు ప్రతిఒక్కరూ దూరంగా ఉండాలని ప్రత్తిపాడు సీఐ సూరి అప్పారావు, ఎస్ఐ వెంకటేశ్వరరావు చెప్పారు. ఆదివారం రాత్రి మండలంలోని ధారపల్లిలో తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలంలో ఎక్కడైనా గంజాయి, సారా వంటివి విక్రయిస్తే తమకు సమాచారం ఇవ్వాలని కోరారు.

రంపచోడవరం

• రంపచోడవరం • మారేడుమిల్లి • రాజవొమ్మంగి • అడ్డతీగల • వై రామవరం • గంగవరం • దేవీపట్నం • చింతూరు • కూనవరం • వీఆర్ పురం • ఎటపాక

పాపికొండలకు ఐదు బోట్లు


పర్యాటకులతో వెళ్లేందుకు ఉన్న బోట్లు

దేవీపట్నం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): పాపికొండలు అందాలను తిలకించేందుకు 250 మంది ప్రకృతి ప్రేమికులు ఆదివారం ఐదు బోట్లలో తరలి వెళ్లారు. తొలేత పోశమ్మ గండి వద్ద బోటు పాయింటు నుంచి గోదావరి ముంపు పరీవాహక ప్రాంతాలైన పూడిపల్లి, దేవీపట్నం, తొయ్యేరు, మంటూరు, మూలపాడు, అగ్రహారం, కచ్చులూరు, తాళ్లూరు, నడిపూడి, తెలిపేరు, కొండమొదలు, తదితర గ్రామాల మీదుగా పేరంటాలపల్లి వెళ్లి అక్కడ గిరిజనులు తయారుచేసిన వెదురుబొమ్మలను కొనుగోలు చేశారు. అనంతరం పేరంటాలపల్లిలో ఉన్న జలపాతాల వద్ద సందడి చేసి శివాలయంలో పరమేశ్వరుడిని దర్శించుకుని వెనుదిరిగారు.

పశువుల అక్రమ రవాణా అడ్డగింత

● ముగ్గురిపై కేసు నమోదు ● 32 గోవులు సంరక్షణశాలకు..


వ్యాన్‌తో పోలీస్, పక్కన పశువుల అక్రమదారుడు (లుంగీతో ఉన్న వ్యక్తి)

వై.రామవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలం మీదుగా సాగుతున్న పశువుల అక్రమ రవాణాను పోలీసులు అడ్డుకున్నారు. ఆదివారం తమకు అందించిన సమాచారం మేరకు కొమరవరం కూడలిలో వాహనాల తనిఖీ చేపట్టారు. దారగడ్డ మీదుగా వస్తున్న రెండు వ్యాన్లలో పశువుల రవాణాను గుర్తించినట్టు ఎస్ఐ రామకృష్ణ తెలిపారు. వాటికి ఎటువంటి నీరు, ఆహారం పెట్టకుండా కాళ్లు కట్టేసి జగ్గంపేట, గోకవరం ప్రాంతాల్లో అమ్మేందుకు తరలిస్తున్నారని చెప్పారు. నెల్లిపూడికి చెందిన లోవరాజు, కామరాజుపేటకు చెందిన అమృత శ్రీను, బొండల శ్రీనుపై యానిమల్ యాక్ట్ కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. రెండు వ్యాన్లను స్వాధీనపరుచుకుని 32 పశువులను గోసంరక్షణ కేంద్రానికి తరలించామన్నారు.

గురమందను దర్శించిన రాష్ట్ర బీసీ నాయకులు


శివుడి విగ్రహానికి పూజలు చేస్తున్న రాష్ట్ర బీసీ సంఘం నేతలు

వై.రామవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ప్రకృతి శివాలయంలో కొలువైయున్న గురమంద విశ్వనాథ స్వామిని బీసీ సంఘం రాష్ట్ర నాయకులు ఆదివారం సందర్శించారు. నందం శ్రీనివాసరావు, శెట్టిబలిజ కన్వీనర్ దంగేటి సత్తిబాబు, మానస అప్పారావు, తదితరులు శివలింగానికి అభిషేకాలు చేశారు.శంకర్, విక్రమ్, శేఖర్, గ్రామస్థులు, తదితరులు పాల్గొన్నారు.

నరసాపురం క్వారీని నిలుపుదల చేయాలి


మాట్లాడుతున్న ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకుడు కుంజ శ్రీను

రంపచోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నరసాపురం క్వారీ బాంబ్ బ్లాస్టింగులతో ఇళ్ల గోడలు బీటలు వారుతున్నాయని, ఆ క్వారీని తక్షణం నిలుపుదల చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను డిమాండ్ చేశారు. దిరిసినపల్లి, నరసాపురం గ్రామాల్లో నిత్యం విచ్చలవిడిగా బాంబ్ బ్లాసింగ్‌ల వల్ల పొగ, దుమ్ము ఏర్పడుతోందని, శ్వాస పీల్చుకునేందుకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారన్నారు. మెటల్ క్వారీతో ప్రజారోగ్యం, ఆస్తులతో పాటు పర్యావరణానికి కూడా నష్టం కలుగు తోందన్నారు. తొలుత బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ నేతలు బొరగ గంగరాజుదొర, పొడియం అరుణ కుమారి, బల్లెం గంగా, వెంకటలక్ష్మి, పొడియం జోగమ్మ, తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ మహాసభలు విజయవంతం చేయాలి


గోడపత్రికను ఆవిష్కరిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు

రంపచోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో ఈ నెల 28,29 తేదీల్లో జరిగే పీడీఎస్‌యూ మహాసభలను విజయవంతం చేయాలని ఆ సంఘం రాష్ట్ర నాయకుడు పల్లాల అశోక్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆయన మహాసభల గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య ప్రైవేటీకరణ, సరళీకరణ విధానాలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ ప్రకటించనున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు ఐవీ రమణ, పల్లాల మాహోరెడ్డి, ఇల్లా శివారెడ్డి, పి.లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ పదవీ బాధ్యతలపై హర్షం

రంపచోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్, సభ్యురాలుగా సోమవారం బాధ్యతలు స్వీకరిస్తున్న సోళ్ల బొజ్జిరెడ్డి, గొర్లె సునీతకు గురుకులం నాన్ టీచింగ్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి మాదె రామచంద్రరావు శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో అనేక సమస్యలతో సతమతమవుతున్న ప్రజలకు వారి పదవులు ఉపయోగకరమన్నారు.

ఐటీడీఏ ధర్నాకు తరలిరావాలి

రంపచోడవరం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ఆదివాసీల సమస్యలు, రోడ్లు, నేషనల్ పార్క్, ఏకో సెన్సిటివ్ జోన్ తదితర అంశాలపై అఖిల భారత రైతు కూలీ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఐటీడీఏ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నారు. ఇందులో పాల్గొనేందుకు ప్రజాప్రతి నిధులు, ప్రజలు అధిక సంఖ్యలో తరలిరావాలని సంఘ నాయకులు ఎం.దుర్గాప్రసాద్, వంకాయ మాధవరావు ఆదివారం ఒక ప్రకటనలో కోరారు.

అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ నిర్వహణ


మాట్లాడుతున్న ఆదివాసీ సంఘం నాయకులు

వీఆర్‌పురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండల పరిధి రేఖపల్లిలో గ్రామ పంచాయతీ అనుమతులు లేకుండా ఎగ్జిబిషన్ నిర్వహిస్తున్నారని ఆదివాసీ డివిజన్ వైస్ చైర్మన్, రేఖపల్లి ఉప సర్పంచ్ పాయం లక్ష్మణరావు అన్నారు. ఒడిశా రాష్ట్రం నుంచి వచ్చిన ప్రైవేట్ వ్యక్తులు దీన్ని నిర్వహిస్తున్నట్టు చెప్పారు. గ్రామ పంచాయతీ అనుమతులు, పంచాయతీ కమిటీ సభ్యుల తీర్మానం లేకుండా, ఎన్వోసీ లేకుండా నిర్వహించడం పీసా చట్టానికి వ్యతిరేకమన్నారు. 1/70 చట్టం ఈ ప్రాంతంలో అమలులో ఉన్నప్పటికీ స్థానిక తహశీల్దార్ వేరే రాష్ట్రం నుంచి వచ్చిన వ్యక్తులకు ప్రభుత్వ భూమి (సర్వే నెం 152/2లోని) నాలుగెకరాల 32 సెంట్లలో నెల రోజుల వరకు ఎగ్జిబిషన్ నిర్వహణకు ఎలా కేటాయించారని ఆదివాసీ సంక్షేమ పరిషత్ సంఘం నేతలు ప్రశ్నించారు. ఇకనైనా తగుచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆదివాసీ డివిజన్ నేతలు పేటకాని మల్లయ్య, సోడి భానుచందర్, జీడిగుప్ప ఎంపిటిసి వాళ్ల వెంకటేశ్వర రెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా కార్తీక వన సమారాధనలు

» విచ్చేసిన పలువురు ప్రముఖులు
» సాంస్కృతిక కార్యక్రమాలు
» ఉల్లాసంగా గడిపిన చిన్నాపెద్ద


కొత్త కొండబాబును సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండల ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యంలో కొత్త నరసింహారావు పామాయిల్ తోటలో కార్తీక వన సమారాధన నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆర్యవైశ్య వెల్ఫేర్ అండ్ డెవలప్మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ కొత్త వెంకటేశ్వరరావు (కొండబాబు), ఆర్యవైశ్య సేవా సంఘం మండల గౌరవాధ్యక్షుడు అత్తులూరి సాయిబాబా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అనంతరం కొత్త కొండబాబుని సత్కరించి మెమెంటో అందించారు. లక్కీ డిప్ ద్వారా విజేతలకు ముఖ్య అతిథులు బహుమతి అందజేశారు. ఆర్యవైశ్య సంఘం మండలాధ్యక్షుడు చిత్రపు బాబు అధ్యక్షతన జరిగిన సభలో జగ్గంపేట, గండేపల్లి, కిర్లంపూడి మండలాల ఆర్యవైశ్యులు పాల్గొని సహ పంక్తి భోజనాలు చేశారు.

కిర్లంపూడి: మండలంలోని రాజుపాలెంలో గణేశుల రాంబాబు, లక్ష్మణరావు ఆధ్వర్యంలో శ్రీకృష్ణుడి ఆలయం వద్ద ఉసిరిచెట్టుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళలకు తాంబూళం అందించారు. భజన కీర్తనలతో అలరించారు. అనంతరం అన్నదానం జరిపారు. రాజుపాలెం, రామకృష్ణాపురం, వీరవరం, ముక్కొల్లు గ్రామాల భక్తులు పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెంలోని ఆదిత్య యూనివర్సిటీకి చెందిన అడ్మినిస్ట్రేషన్ స్టాఫ్ పరిపాలన విభాగ సిబ్బంది కార్తీక వనసమారాధన నిర్వహించారు. ఆదిత్య సిబ్బంది తమ కుటుంబీకులతో కలిసి ఆనందంగా గడిపారు. సహపంక్తి భోజనాలు చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణ జాతీయ అవార్డు పొందిన జి.సోమేశ్వరరావు దంపతులకు జ్ఞాపిక అందించి సత్కరించారు.


రాజుపాలెంలో ఉసిరిచెట్టు వద్ద పూజలు చేస్తున్న దృశ్యం


వనసమారాధనలో ఆదిత్య సిబ్బంది

రేకుల షెడ్డే వంటశాల

● వర్షమొస్తే అవస్థలు వర్ణనాతీతం
● మోతుగూడెం హైస్కూల్లో మధ్యాహ్నం నిర్వహణ


మోతుగూడెం హైస్కూల్లో రేకుల షెడ్‌లో వంటలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకం కార్మికులు

మోతుగూడెం, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మోతుగూడెంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 12 ఏళ్ల క్రితం ప్రారంభమైంది. నాటి నుంచీ చిన్నపాటి రేకుల షెడ్డులోనే వంటలు చేస్తున్నారు. వర్షం కురిస్తే లోనికి నీరు చేరకుండా చుట్టూ మట్టితో గట్టు వేసుకుని వంట చేయాల్సిన పరిస్థితి. 2020 ఫిబ్రవరిలో నాడు-నేడు ఫేజ్-2లో అప్పటి ప్రభుత్వం ఈ పాఠశాలకు నాలుగు అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, మూత్రశాలలు, వంట గది నిర్మాణానికి రూ1.70 కోట్లు మంజూరు చేసింది. వాటిలో మరుగుదొడ్లు, మూత్రశాలలు మాత్రమే పూర్తయ్యాయి. వంట గది నేటికీ నిర్మాణ దశలోనే ఉంది. గదికి తలుపులు, కిటికీలు, వాష్ బేసిన్లు బిగించి రంగులు వేయాల్సి ఉంది. దీనిపై మండల విద్యాశాఖాధికారి వెంకటేశ్వర్లును వివరణ కోరగా.. నాడు-నేడు పనులను ప్రభుత్వం నిలిపివేసిందన్నారు. అనుమతిస్తే తిరిగి ప్రారంభమవుతాయని చెప్పారు.

చెలమల నీరే దిక్కు

● సుకుమామిడిలో తాగునీటి కష్టాలు
● మోటార్ స్విచ్ బోర్డ్ కాలిపోవడంతో అవస్థలు


చెలమ నుంచి నీరు తోడుతున్న దృశ్యాలు



మోతుగూడెం, నవంబరు 16 (ఆంధ్రజ్యో): చింతూరు మండలం కొత్తపల్లి పంచాయతీ సుకుమామిడి ప్రజలు తాగునీటి కష్టాలు ఎదుర్కొంటున్నారు. 15 రోజుల క్రిందట స్విచ్ బోర్డు కాలిపోవడంతో గ్రామానికి నీళ్లు రావడం లేదు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని గిరిజనులు వాపోతున్నారు. గ్రామంలో ఉన్న చేతి పంపులోంచి పది బిందెల నీళ్లే వస్తాయి. అవి ఎర్రగా ఉండడంతో తాగేందుకు భయపడుతున్నారు. దీంతో గ్రామస్థులు అడవిలోంచి పెద్ద వాగు వద్దకు వెళ్లి చలమ నుంచి నీటిని తెచ్చుకుంటున్నారు. వాటిని తాగడంతో మలేరియా, టైఫాయిడ్, విష జ్వరాలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు దృష్టిసారించి మంచినీటి సమస్యను పరిష్కరించాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

చిల్లంగిలో నగర సంకీర్తనలు


గుబ్బాలమ్మను దర్శించుకుంటున్న భక్తులు

కిర్లంపూడి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీకమాసం సందర్భంగా మండలంలోని చిల్లంగిలో గ్రామదేవత గుబ్బాలమ్మ ఆలయ కమిటీ సభ్యులు కాళ్ల వెంకటేష్, కర్రి సింగరయ్య సుమారు 50మంది భక్తులు ఆదివారం వేకువజాము నుంచి ఉదయం 6గంటల వరకు నంగర సంకీర్తనలు నిర్వహించారు. గ్రామానికి చెందిన సంగన గొల్లబాబు, లక్ష్మితులసి దంపతులతో నూతన వస్త్రాలు ఇచ్చి సత్కరించారు.


పార్టీలో చేరిన వారితో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే యనమల దివ్య

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎమ్మెల్యే యనమల దివ్య

తునిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే యనమల దివ్య తెలిపారు. ఆదివారం తేటగుంట టీడీపీ క్యాంప్ కార్యాలయంలో యనమల రాజేష్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆమె హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏవీ నగరానికి చెందిన పలువురు వైసీపీ దళిత నాయకులు టీడీపీలో చేరగా వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. పార్టీలో చేరిన ముఖ్య వైసీపీ నాయకులు డేగల డేవిడ్‌రాజు, డేగల కృష్ణ, డేగల ప్రకాష్, బత్తిన కిషోర్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో కొయ్యా కేశవ్, కొయ్యా సూరిబాబు, బొండాడ బాబ్జి, కడారి శ్రీను తదితరులు ఉన్నారు.


తెప్పోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో తెప్పోత్సవం

ప్రత్తిపాడు, నవంబరు 16(ఆంధ్రజ్యోతి): మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో ఆదివారం రాత్రి తెప్పోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అపీత కుచాంబ సమేత అరుణాచలేశ్వరుని పడవపై ఉంచి వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య తెప్పోత్సవాన్ని నిర్వహించారు.

జాతీయ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ


బహుమతులు పొందిన అఖిల్, విద్యార్థులు

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా స్పోర్ట్స్ అకాడమీలో ఆదివారం నిర్వహించిన జాతీయ కరాటే, కుంగ్‌ఫూ పోటీల్లో ప్రత్తిపాడు విద్యార్థులు ప్రతిభా కనబరిచి సీనియర్స్ జూనియర్స్ విభాగాల్లో మొదటి రెండు స్థానాలు సాధించారు. స్థానిక అఖిల్ ఐటీ టాలెంట్ స్కూల్‌కు చెందిన సీనియర్స్ విభాగంలో ఎన్.నిశాంత్ మొదటిస్థానం, కస్తూరి రెండోస్థానం సాధించారు. జూనియర్స్ విభాగంలో మొదటిస్థానం జి.హేమలత, రెండోస్థానం కె.డెవిడ్ సాధించారు. వీరికి డి.కరాటే మాస్టారు. శిక్షణ ఇచ్చిన వి.బుజ్జితోపాటు అఖిల్, స్కూల్ ప్రిన్సిపాల్ యనకోటి సునీత, గంగాధర్‌లు అభినందించారు.




ప్రత్తిపాడులో వెంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ జరిపిన దృశ్యం. పక్క చిత్రంలో రాచపల్లి అరుణాచలేశ్వర ఆలయంలో గంగాహారతి ఇస్తున్న మహిళలు

వేంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు తోటవీధిలోని షిర్డీసాయి మందిరంలో ఉన్న వెంకటేశ్వరస్వామికి లక్ష తులసి పూజ నిర్వహించారు. వైష్ణవ గురువు వాడపల్లి గోపాలాచార్యుల బృందం వీటిని నిర్వహించారు. మహిళా భక్తులు అమ్మవారికి కుంకుమార్చనలు, లలిత సహస్ర, విష్ణు సహస్రనామ పారాయణలు నిర్వహించారు. ఈ పూజల్లో జలిగంపల ప్రభాకరరావు, ఆలయ కమిటీ నిర్వాహకులు చిలకమర్తి సాయిప్రసాద్, సోషల్ వెల్ఫేర్ అధికారి తేజోమూర్తుల వీరభద్రప్రసాద్, కిర్లంపూడి ఎంఈవో బి.నీరజ, స్థానికులు తాతాజీ, అనిసింగరాజు వాణి, రామరాజు వర్మ, శేషవరపు సత్యరాజు, వైదేహి, ఆలయ అర్చకుడు చంద్రంబాబు, పలువురు భక్తులు పాల్గొన్నారు. రాచపల్లిలోని అరుణాచలేశ్వర ఆలయంలో కార్తీక బహుళ ద్వాదశి సందర్భంగా కాలభైరవ స్వామికి, అరుణాచలేశ్వరస్వామికి పంచామృత రుద్రాభిషేకాలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపకులు స్వామి రామానంద ఆధ్వర్యంలో హోమం జరిపారు. పుష్కరిణి వద్ద మహిళలు గంగాహారతి నిర్వహించారు.

ఐక్యతకు వనసమారాధనలు కీలకపాత్ర


దీపాల కాంతుల్లో కనువిందు చేస్తున్న తపోవన క్షేత్రంలోని అనుబంధ ఆలయాలు

తునిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ ఆధ్యాత్మిక పీఠం తపోవన క్షేత్రంలో పీఠాధిపతులు సచ్చిదానంద సరస్వతి స్వామిజీ ఆధ్వర్యంలో కార్తీక మాసోత్సవాలు వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం తపోవన ప్రాంగణంలో కార్తీక దీపోత్సవం దేదీప్యమానంగా దర్శనమిచ్చాయి. అధిక సంఖ్యలో భక్తులు దీపోత్సంలో పాల్గొన్నారు.

క్షత్రియ వన సమారాధన

తునిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): క్షత్రియ సేవా సమితి ఆధ్వర్యంలో ఆదివారం తునిలో కార్తీక వన సమారాధన జరిగింది. తునిలోని సాయి సీతారామ కన్వెన్షన్‌లో జరిగిన ఈ వేడుకకు మాజీ ఎమ్మెల్యే క్షత్రియ సేవా సమితి గౌరవాధ్యక్షుడు రాజా అశోక్‌బాబు దంపతులు, అధ్యక్షుడు మురళీరాజు తదితరులు అల్లూరి సీతారామరాజు చిత్రపటానికి నివాళులర్పించారు. బ్రహ్మకుమారి మాధవీలత కార్తీకమాస విశిష్టత తెలియజేయగా మహిళలు కోలాటంతో ఆకట్టుకున్నారు. అనంతరం విష్ణు సహస్రనామ పారాయణం చేపట్టారు. ప్రతిభావంతులైన విద్యార్థులకు ఉపకార వేతనాలు అందించారు. అనంతరం సహపంక్తి భోజనాలు చేసి సాయంత్రం వరకు సందడి చేశారు. కార్యక్రమంలో క్షత్రియ ప్రముఖులు శ్రీనివాసరాజు, భీమరాజు, రాయపు రాజు, వెంకటరాజు, సత్యనారాయణ రాజు, రమేష్‌రాజు తదితరులు ఉన్నారు.

కార్తీక దామోదరుడికి పూజలు

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): కార్తీక వన సమారాధనలతో గ్రామస్థుల మధ్య ఐక్యమత్యం పెంపొందుతుందని భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకుడు పత్రి రమణ, విశ్వబ్రాహ్మణ సంఘ స్థానిక అధ్యక్షుడు గానాల గంగాధర్, జిల్లా క్రమశిక్షణ కమిటీ అధ్యక్షుడు ధర్నాలకోట శ్రీను అన్నారు. ప్రత్తిపాడు గ్రామంలోని వేలంక గ్రామంలోని మామిడితోటలో ఆదివారం విశ్వ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం వన సమారాధన నిర్వహించారు. ఉసిరిచెట్టు వద్ద కార్తీక దామోదరునికి విశ్వకర్మ భగవాన్‌కు పూజలు చేశారు. కార్యక్రమంలో ధర్నాల కోట వీరబాబు, ఎ.రమణ, బి.కన్నాబత్తుడు, కె.శివ, సొమ్మోజు రాజు, జి.కిట్టయ్య, గవరసింగ్ అబ్బులు, కె.శ్రీకృష్ణ, డి.అబ్బులు, చిట్టియ్య పాల్గొన్నారు.

నేడు శివకేశవులకు పూజలు

జగ్గంపేట, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జగ్గంపేట మండలం ఇరిపాకలో ఏలేరు నది తీరాన ఉన్న మల్లికార్జునస్వామి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి వేంచేసి ఉన్న శివకేశవుల దేవస్థానంలో కార్తీక మాసం సందర్భంగా సోమవారం శివ కేశవులకు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. 1108 బిందెల ఏలేరు నదీ జలాలతో భక్తులతో ఈ అభిషేకం జరిపిస్తారు. అనంతరం తీర్థ ప్రసాదాలతో పాటు అభిషేకం నిర్వహించిన రుద్రాక్షలను భక్తులకు అందిస్తామని ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ మణి దంపతులు తెలిపారు.

కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్ మోహనరావుకు సత్కారం

గండేపల్లి, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సింగరంపాలెం గ్రామానికి చెందిన రాష్ట్ర కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్, టీడీపీ మండలాధ్య క్షుడు పోతుల మోహనరావును రాజమండ్రిలో జరిగిన కాకతీయ కమ్మ వనసమారాధనలో రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి సత్కరించారు. కమ్మ కార్పొరేషన్ డైరెక్టర్‌గా తనకు అవకాశం ఇచ్చిన ప్రభుత్వానికి మోహనరావు కృతజ్ఞతలు తెలిపారు.

శ్రీప్రకాష్‌లో స్పైస్ సందడి

తుని రూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): శ్రీ ప్రకాష్ జూనియర్ కళాశాల విద్యార్థులు స్పైస్ ప్రోగ్రాం పేరిట ప్రత్యేక కార్యక్రమంలో సందడి చేశారు.విద్యార్థులంతా కలిసి శని, ఆదివారాల్లో రోజంతా ఉల్లాసంగా ఉత్సాహంగా గడిపారు. నృత్యాలతో సందడి చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ వీవీఎస్ భానుమూర్తి మాట్లాడుతూ విద్యార్థుల తన దైనందిన కార్యక్రమాలకు భిన్నంగా ఉల్లాసంగా, ఉత్సాహంగా గడపాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు.

జాతీయస్థాయి కుస్తీ పోటీలకు ఆదివాసీ విద్యార్థిని ఎంపిక



వీఆర్‌పురం, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి కుస్తీ పోటీలకు మండలంలోని సోములగూడెం ఆశ్రమ బాలికల పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థిని మడకం సురేఖ ఎంపికైంది. విజయవాడలో ఈనెల 4 నుంచి 6 వరకు జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14, 33 కిలోల విభాగంలో బంగారు పతకం సాధించింది. ఇందుకుగాను 2026 జనవరి మొదటి వారంలో ఢిల్లీలో జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైంది.ఈ సందర్భంగా సోములగూడెం పాఠశాల ప్రధానోపాధ్యాయులు, సిబ్బంది సురేఖను అభినందించారు.


4.2 కిలోల బరువుతో పుట్టిన శిశువు

ప్రత్తిపాడు ఆసుపత్రిలో బాల భీముడు జననం

ప్రత్తిపాడు, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రిలో ఆదివారం 4.2 కిలోల బరువు ఉన్న బాల భీముడు జన్మించాడు. తునికి చెందిన వెలుగుల శ్యాం సుందర్ భార్య క్రాంతికి నెలలు నిండడంతో ఆదివారం పురిటి నొప్పులు ప్రారంభమయ్యాయి. వెంటనే ఆమెను ప్రత్తిపాడు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రి సూపరింటిండెంట్ డాక్టర్ సౌమ్య మైకేల్ క్రాంతికి సాధారణ ప్రసవానికి అవకాశం లేకపోవడంతో సిజేరియన్ చేసి బిడ్డను తీశారు. శిశువు బరువు 4.2 కిలోలు ఉండడంతో బాల భీముడు పుట్టాడంటూ ఆసుపత్రి వర్గా లు వ్యాఖ్యానించాయి. తల్లిబిడ్డలు క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి వైద్యాధికారి సౌమ్య తెలిపారు.


తుని కొండవారిపేటలో తనిఖీ చేస్తున్న పోలీసులు

తునిలో పోలీసుల తనిఖీలు

తునిరూరల్, నవంబరు 16 (ఆంధ్రజ్యోతి): తునిలో పట్టణ సీఐ గీతారామకృష్ణ ఆధ్వర్యంలో కొండవారిపేటలో పోలీసులు తనిఖీలు చేపట్టారు. కాకినాడ నుంచి వచ్చిన పోలీసు బలగాలు, స్థానిక పోలీసుల ఆధ్వర్యంలో ఆదివారం తెల్లవారుజామున కార్డన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఆ ప్రాంతంలో అనుమానిత వ్యక్తులను తనిఖీ చేసి వారి ఆధార్‌కార్డులను పరిశీలించారు. అనుమానిత వాహనాలను తనిఖీ చేసి వాటి రికార్డులు పరిశీలించారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా సారా అమ్మేవారు, గంజాయి తాగేవారు ఎక్కువగా ఉన్నారనే అనుమానంతో ఈ ఆపరేషన్ నిర్వహించినట్లు తెలిపారు. అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే 94407 96572లో సంప్రదించాలని తుని పట్టణ సీఐ గీతారామకృష్ణ తెలిపారు.